UNIVERSAL
LIBRARY
OU_204284
UNIVERSAL
LIBRARY

# శ్రీరామచంద్రమూర్తి

ప్రణేత:

జనమంచి సీతారామస్వామి,

సహోపాధ్యాయుఁడు, మ్యునిసిపల్ హైస్కూల్,

అనకాపల్లి.

THE ANDHRA BOOK HOUSE
SULTAN BAZAR, HYDERABAD

ప్రకాశకులు:

తెలికిచర్ల వేంకటసుబ్బారావు,

రాజమహేంద్రవరము.

1924

ఓం.

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.

# పీఠిక

దేహాత్మవాదులు మనదేశమునం దంతగా లేరు. బుద్ధిబలశరీరబల ధనబలగర్వాతిరేకముచేతనో, యౌవనోన్మాదముచేతనో, యొకప్పు డెవరేని యనాత్మవాదముచేసినను పెద్దకష్టములు తటస్థించినప్పుడు, భయార్తులై, వారు పూర్వము లేదన్న పరమాత్మనే శరణుచొచ్చి బహువిధములఁ బ్రార్థించుచుండుట లోకవిదితము.

పరమాత్మను సేవించి భవబాధావిముక్తినందుటకుఁ గర్మ భక్తి జ్ఞానము లను మూడుమార్గము లున్నవని మనపెద్దలు చెప్పినారు. ఈకాలములో నందు భక్తి యుత్తమమార్గమని వారే సెలవిచ్చినారు.

ధర్మములు చెడి, నీతి యడుగంటి, పరమార్థచింత తగ్గి, యింద్రియసుఖవాంఛలు హెచ్చి, సంఘ ముచితస్థితిఁ బాసి తాఱుమాఱై, మార్చుటకు మనుష్యబలము చాలనప్పుడు, ఆ యపారకరుణామయుమైన దుర్విజ్ఞేయతత్త్వమే, పరమభక్తుల ప్రార్థన లాలించి, మనకోసము మనుష్యశరీరమును గ్రహించి, దుష్టశిక్షణ, శిష్టరక్షణములు గావించి, పునస్సద్ధర్మసంస్థాపనము చేసి, దేశము తిన్నఁబఱుచునని మనపవిత్రగ్రంథములు పలుకుచున్నవి.

అట్టి ఆజన్మశుద్ధులే, నిత్యముక్తులే, నిర్మలకల్యాణచారిత్రులే, శ్రీరామకృష్ణాద్యవతారపూరుషులు. జీసస్క్రీస్తును అట్టివాఁడే!

అట్లైన శరీరకలుషములు సచ్చిదానందమూర్తి నంటి చెఱుపఁ దురేమో! చెఱుపవు.

దీపము లాంతరులోఁ బెట్టినప్పుడు దీపకాంతి చెడునా! యొక్క యద్దములకుఁ దత్పూర్వములేని శోభనిచ్చునా?

# పీఠిక

తండ్రి కంఠాశ్లేష మపేక్షించి పైచూపులతోఁ దత్తఱపడి యత్తలపడుచు గిజగిజ కొట్టుకొనుచున్న చిన్నిశిశువును జూచి, జాలిపడి క్రిందికి వంగి చదికిలఁబడి మెడయిచ్చి, యాశిశువు కంఠమును గౌఁగిలించుకొని యుప్పొంగుచుండఁగాఁ, దాను నుప్పొంగి చిట్టిచేతులను బట్టికొని చెక్కుల ముద్దులిడు జనకుఁడు, న్యూనత్వమును జెందినవాఁడా? అపారప్రేమపయోరాశి యగు పుత్రవత్సలుఁడా?

లాంతరద్దములకు దీపమెట్లో, యవతారపురుషశరీరములకా యఖండ సచ్చిదానంద జ్యోతి యట్లు. అత్యంతప్రేమాన్వితుఁడై యానతాంగుఁడైన తండ్రి బిడ్డనికెట్లో, భక్తపురుషులకు భక్తవత్సలుఁడైన భగవంతుఁ డట్లు.

ఆతండ్రియే శ్రీరామచంద్రమూర్తియై లోకోద్ధరణార్థ మవతరించినాఁడు. ఎట్టిధీరోదాత్తుఁడు! ఎట్టిపితృవాక్యపరిపాలనాపరుఁడు! ఎట్టిసౌభ్రాత్రనిధి! ఎట్టిశాంతమూర్తి! ఎట్టిపరోపకారతత్పరుఁడు! ఎట్టిమహారాజాధిరాజు! ఎట్టివిమతదుర్గర్వపరిహారపటిష్ఠుఁడు! ఎట్టిరణశూరుఁడు! ఎట్టిశరణాగతవత్సలుఁడు! ఎట్టికరుణామయుఁడు! ఎట్టిస్వసుఖపరిత్యాగి! "నాయనా! నీకొఱకే యిన్నిసంవత్సరములు పురోహితుఁడనై రఘువంశము నాశ్రయించుకొని కనుపెట్టుకొని కనుపెట్టుకొని యున్నా"నని జననకాలమందు శ్రీవసిష్ఠమహర్షి పలికిన భక్తలోచనచకోరపార్వణచంద్రుఁడు.

అట్టి శ్రీరామచంద్రమూర్తి పావనకథను—ఉత్తరరామాయణములోని ప్రధానవిషయమును— హృద్యమగు గద్యకావ్యముగా జనమంచి సీతారామస్వామిగారు వ్రాసినారు.

ఆయనను నే నెఱుఁగుదును. మంచిబుద్ధిశాలి. భక్తియుక్తచిత్తుఁడు. ఇదివఱకే 'ప్రహ్లాదచరిత్ర' 'భీష్మమహిమ' యనుభక్తమౌళుల చరిత్రములు రెండు వ్రాసి బాలురకుఁ బరిచితుఁడై యున్నవాఁడు.

ఈగ్రంథముశైలి చక్కఁగా నున్నది. భాష నిర్దోషముగను, నాతికఠినముగను, లలితముగను నున్నది. మంచిమంచిపూవులనుండి తెచ్చి మధుకోశములోఁ బెట్టిన మధురమధురసబిందువులవలె, మకుటములుగాను, మధ్యస్థలము

## పీఠిక

లందును జేర్చినపద్యములు, శ్లోకములు, సీసములుగను సందర్భోచితములు గను గాన్పించుచున్నవి. కవిశ్రేష్ఠుఁడగు కంకంటి పాపరాజుగారు మున్నగు వారిపద్యరత్నములు వ్రాయుచుఁ, దత్తద్భావములు పునరుక్తిగా వచనము లోఁగూడ గ్రంథకర్తగారు వ్రాసిరి. అట్లుచేయుట, పద్యముల కింకను నలవాటుపడని బాలకుల యుపయోగముకొఱకే యని తలఁచెదను.

కరుణారసప్రధానమైన కథగానఁ, గంటఁ దడిపెట్టుకొనకుండఁ జదువ లేనిభాగములు పెక్కులున్నవి. అందు సీతాలక్ష్మణసంభాషణ మొక్కటి. గ్రంథకర్తవాక్యరచనానైపుణ్యము, రసోత్పాదనశక్తియు నందు బాగుగా గాన్పించుచున్నవి.

పరదేశప్రసిద్ధపురుషుల ప్రశంసకంటె భరతవర్షములోని మహాను భావుల నీతిప్రధానములైన సచ్చరిత్రములు దేశాభిమానమును, దైవభక్తిని బ్రజ్వలింపఁజేసి, నడతలను సవరించి, మనబాలుర కెక్కువమేలు చేయునని నాయభిప్రాయము.

శ్రీరామచంద్రచారిత్రమును శ్రీరామపాదారవిందభక్తులగు శ్రీరావు రామయాఁబబహదరుగారి కంకితమిచ్చుట బంగారమునకుఁ బరిమళమును గూర్చినట్లున్నది.

రసపుష్టియు భాషాశుద్ధియుఁ గల యిట్టిపుస్తకములు పాఠశాలలలోఁ బఠనీయగ్రంథములుగాఁ బెట్టి, విద్యాశాఖాధికారులు నిట్టిగ్రంథకర్తలను బ్రోత్సాహపఱిచినచో నాంధ్రబాలురకు శ్రేయోదాయకులగుదురు.

విద్యార్థుల కుపయుక్తములగు నిట్టిపుస్తకము లింకను వ్రాసి, గ్రంథకర్తగారు వారికృతజ్ఞత కింకను మిక్కిలి పాత్రులగుదురుగాక!

సీతారామస్వామిగారి కా శ్రీసీతారామస్వామి దీర్ఘాయురారోగ్యముల నిచ్చి యైహికాముష్మికానందములు ప్రసాదించునుగాక!

పిఠాపురము,
15-12-1920

—కూచి నరసింహము.

ఓం

# విజ్ఞప్తి

శ్రీ కంకంటి పాపరాజమహాకవిచే రచియింపఁబడిన ఉత్తరరామాయణము చదివినప్పుడు నేనింతింతనరాని సంతసమునొంది యందలికథను —శ్రీరామచంద్రమూర్తి గుణవర్ణనమునకు సంబంధించినంతవఱకు— వచనకావ్యముగ వ్రాయ నిశ్చయించుకొంటిని. పరమేశ్వరానుగ్రహవిశేషమున నేఁటికి సఫలమనోరథుండనైతినిగాన నామహానుభావునకుఁ గృతజ్ఞతాపూర్వకముగ, హృదయపూర్వకముగ, వినయపూర్వకముగ వందనసహస్రంబు లర్పించుచున్నాఁడను.

గుణసముద్రుఁడైన రామభద్రు పవిత్రచరిత్రఁ దృప్తికరముగ వర్ణింపనలవిగాకపోయినను, ఆజగదేకకీర్తనీయునిగూర్చి యెంతమాత్ర మెట్లు వ్రాసినను కొంతధన్యత సిద్ధించుననునాశ నామనంబునం దుదయింపకపోలేదు.

అందఱు వాల్మీకి, భవభూతి, జయదేవుఁడు, త్యాగయ్య, పాపరాజు మొదలగు రామమహత్త్వవర్ణనప్రవీణులుం గాలేరుగాని, గుహునివలెనో, శబరిరీతినో, యుడుతకరణినో తమభక్తి వెల్లడించుకొనవచ్చును గదా!

ముఖ్యముగాఁ బాపరాజప్రణీతగ్రంథము ననుసరించి యీపొత్తము వ్రాసితిని. అందలి పద్యరాజములును, వాక్యరత్నములిందు ధారాళముగా నుపయోగింపఁబడినవి. కాని దోషములున్న నావనియు, గుణము లన్నియు నాతనివనియుఁ జనువరు లూహింతురుగాక! —(చివరపుటనున్న తప్పొప్పులపట్టిక చూడఁదగు.)

# విజ్ఞప్తి

ఈపుస్తకమునకు దయాపూర్వకముగఁ బీఠిక వ్రాసియిచ్చిన బ్రహ్మశ్రీ కూచి నరసింహముగారికి — సంస్కృతాంధ్రహూణభాషావిశారదులై, శమదమాదిసద్గుణసంపన్నులై, నిరంతరరామపాదారవిందసేవానందపూర్ణులై, గౌరాంగచరిత్రాదిసద్గ్రంథకర్తలై ప్రఖ్యాతికెక్కిన కూచి నరసింహముగారికి — నానమస్కారములు. నా కేమనుష్యునిగుఱించియైనఁ బ్రస్తావము చేయవలసివచ్చినపుడు భూషణవాక్యములే గాని దూషణవాక్యము లాడలేనిసత్స్వభావులుగాన, నలవాటుప్రకారము నన్నుఁగూడఁ బొగడిరి. అంతియ కాని, నేను బ్రశంసార్హుఁడనుగాను. అట్లైనచో, వారిచేఁ బీఠిక వ్రాయింపనేలయని ప్రశ్నింతురేమో? నరసింహముగారికి రాముఁడన్నఁ బ్రాణమగుటయే ప్రధానకారణమని మనవిచేయుచున్నాను.

ఇది కోలంక వీరవరఁయెస్టేట్ల జమీందారిణియైన శ్రీరాజా రావు రామయ్యమ్మారావు బహద్దరుగారి కంకితము చేయఁబడినది. ("అంకితము" అను శీర్షికక్రిందిపద్యములు చూడుఁడు).

నాదేశసేవాగ్రంథమాలాసమర్పణోద్యమమున కేవిధమునసైనఁ బ్రోత్సాహముఁ గలిగించుచున్న వారి కందఱకు వందనములు.

గీ. తలఁపఁగూడని తలఁపులఁ దలఁపనీక
ఆడఁగూడని మాటల నాడనీక
చేయఁగూడని పనులను జేయనీక
భక్తిమీఱఁగ నిన్గొల్చు భాగ్యమొసఁగి
పరమకరుణను నన్నుఁ గాపాడుమెపుడు
సకలహృద్వర్తి! శ్రీరామచంద్రమూర్తి!

పిఠాపురము,
15-12-1920.

—జనమంచి సీతారామస్వామి.



శ్రీ సీతారామలక్ష్మణులు.

# అంకితము

సీ. రామాయణాది సద్గ్రంథపఠనమందుఁ
గాలంబుఁగడపు సుశీలవనుచు
సమరభూజముభంగి సఖిలార్థికోటిఁ గృ
తార్థులఁజేయు పుణ్యవతివనుచు
స్వర్గస్థుఁడైనట్టి పతిని దైవంబుగ
సతతంబు మదిఁగొల్చు సాధ్వివనుచుఁ
దల్లులమఱపించు తల్లివీవనునట్లు
ప్రజలనుబోషించు రాజ్ఞివనుచుఁ

తే. దెలిసి, కడుసంభ్రమాశ్చర్యములనుబొంది
యెవరు నీకీడుగారని యెంచినాఁడఁ
గాన, నంకితమొనరింతు దీని నీకు
రావురామాంబ! దివ్యగుణావలంబ!

గీ. లక్ష్మినరసాపురిఁ వసించు లక్ష్మివనఁగఁ
బద్మనాయక సత్కులాభరణమనఁగ
బ్రజలు సేసినపుణ్యంపుఁ బంటవనఁగ
రాజ్యపాలన మొనరించు రాణివోట
సంతతంబును శ్రీరామచంద్రమూర్తి
నీకుగుతిగాఁగ సత్కార్యనిరతి నెగడి
యెల్లయైశ్వర్యములఁగాంచి రొంసఁగుమమ్మ
రావురామాంబ! దివ్యగుణావలంబ!

ఓం

# శ్రీరామచంద్రమూర్తి

## మొదటి ప్రకరణము

"చ. తరణికులేశ నానుడులఁ దప్పులు గల్గిన నీదునామస
ద్విరచితమైనకావ్యము పవిత్రముగాదె వియన్నదీజలం
బరుగుచు వంకయైన మలినాకృతిఁబాఱిన దన్మహత్త్వముం
దరమె గణింప నెవ్వరికి దాశరథీ కరుణాపయోనిధీ!"

చిరకాలము పతి నెడఁబాసియుండుటచే దుఃఖసముద్రమున మునిఁగియుండి కృశించుచున్న సాధ్వికి భర్తృసందర్శన మెంతయానందకరమో వర్ణింప నెవరితరము? అట్లే పదునాలుగేండ్లు రామముఖారవిందముఁ గానక "యెప్పుడుచూతుమో" యని యువ్విళ్లూరుచు, నిద్రలోసైతము "రామా, రామా" యని పలవరించుచు, "రాముఁడు కొలఁదిదినములలోవచ్చు" ననువార్త చెవిసోఁకినంతనె కొంతయూఱటఁజెందుచు, "నింకను రాలేదే" యని మరల వగచుచు, క్షణమొకయుగముగాఁ గడపు నయోధ్యాపురవాసులకు రామసందర్శనమైనప్పుడు కలిగినసంతోషము వర్ణనాతీతమని వేఱెచెప్పవలయునా?

తండ్రిమాట నిలువఁబెట్టుటకై యడవులకేగి పడరాని బాధలుపడిన శ్రీరామచంద్రమూర్తి—సుగ్రీవాంజనేయాది కపివీరులకుఁ దనచెలిమియను భాగ్యము ననుగ్రహించిన శ్రీరామచంద్రమూర్తి—గర్వభంగముగావించి వారిధికి వారధిగట్టిన శ్రీరామచంద్రమూర్తి—పాపులకుఁ గాపురమైన లంకాపురములోఁ బ్రవేశించి లోకకంటకులైన రావణాద్యసురులను సంహరించిన శ్రీరామచంద్రమూర్తి—తన్నెడఁబాసినదిమొదలు నిద్రాహారములులేక ప్రాణావశిష్టయైయున్న సీతాభామామణిని జెఱనుండి విడిపించి తోడ్కొనివచ్చిన శ్రీరామచంద్రమూర్తి—పగవానితమ్ముఁడైనను సన్మార్గవర్తియై తన్ను నమ్మి సేవించిన విభీషణునకు లంకారాజ్యము దయచేసిన శ్రీరామచంద్రమూర్తి—సకలసద్గుణమూర్తియైన శ్రీరామచంద్రమూర్తి విచ్చేయుటచేఁ బ్రజలందఱు బ్రహ్మానందపరవశులైరి.

"సీ. పూనినసత్కార్యమును బూర్తిసేయఁగా
నపుడుగల్గెడునట్టి హర్షమొకటి
మహనీయుఁడొక్కఁడు మందిరమ్మునుజేరి
నపుడుగల్గెడునట్టి హర్షమొకటి
చాలకాలముమీఁద సఖునిఁజూడఁగఁగల్గి
నపుడుగల్గెడునట్టి హర్షమొకటి
కలుగక, కలుగక, కడకుఁ బుత్త్రుఁడుగల్గి
నపుడుగల్గెడునట్టి హర్షమొకటి
గీ. చెప్పశక్యంబుగాదని చెప్పుచుందు
గాని, నినుఁగన్న సమయానఁ గలుగునట్టి

హర్షమున కెద్దిసాటి? సర్వర్షివినుత !
సకలకల్యాణగుణధన్య ! సర్వమాన్య!"

సాకేతపురమంతయుఁ జిత్రాతిచిత్రరీతుల శృంగారింపఁబడి భూలోకవైకుంఠమో యన్నట్లొప్పుచుండెను. మంగళవాద్యములు మనోహరముగ మ్రోఁగుచు రామమహత్త్వము దశదిశలఁ జాటుచుండెను. ఆబాలగోపాలము రాజసౌధము చుట్టుఁ జేరి రామసంకీర్తన మొనరించుచుండిరి. ఇసుకరాలకుండ స్త్రీపురుషాదిజనము మూఁగి పట్టాభిషేకమహోత్సవమును గన్నులారఁ గాంచుటకుఁ గుతూహలపడుచుండిరి. కొలువుకూటము వివిధవిధముల నలంకరింపఁబడి దగద్ధగాయమానమై విరాజిల్లుచుండెను. అందఱు "నెప్పుడెప్పు" డనియుండిరి. అంతలో ననుకొనినశుభముహూర్తము సంప్రాప్తమైనది. మన్మథమన్మథుఁడైన శ్రీరామమూర్తి సీతాసమేతుఁడై సభాస్థానమునకు విచ్చేసి భద్రాసనాసీనుఁడయ్యెను. ఇఁక నదిగో చూడుఁడు మనరాముని పట్టాభిషేకమెట్లు జరుగుచున్నదో!

"సీ॥ కనఁగల్గె నేఁటికై నను రామునను చుఁ గౌ
సల్యాదిజనము లుత్సాహమొంద
"రామ! నీకీర్తి యారవిచంద్రమవుగాత"
మని వసిష్ఠుండు దీవనలొసంగఁ
దమరు సేసినసుధర్మములు నేఁడుఫలించె
నని పౌరు లుత్సవమున మెలంగ

సకలదేశాధినాయకులు కానుకలిచ్చి
యలికకీలితహస్తులై భజింప

తే. భరతలక్ష్మణశత్రుఘ్న పవనతనయ
భానుజాంగద జాంబవత్ప్రముఖధన్యు
లుచితమగు నూడిగములు సేయుచును గొలువ
రాముఁ డప్పుడు పట్టాభిరాముఁడయ్యె."

## రెండవప్రకరణము

"మ. రవివంశంబునఁబుట్టి, శంకరుధనుర్భంగంబుగావించి, దా
నవసంహారము చేసి, నిర్జరులనానందంబునం దేల్చి, భూ
రి విభూతింజెలువొంది భక్తులను ధాత్రింబ్రోచు శ్రీరామమూ
ర్తివి నేనెంతటివాఁడ నీమహిమ వర్ణింపంగ సీతాపతీ!"

సామ్రాజ్యలక్ష్మిం జేకొనిన రఘుకులతిలకుంగని ప్రశంససేయు తలంపుతో నగస్త్యకణ్వకౌశికాదిమహామునులు నలుదిక్కులనుండి విచ్చేసిరి. రామభూనాథుఁడు వారలనందఱ నుచితరీతి సత్కరించి, కుశలంబరసి, మృదుమధురవాక్యముల నిట్లు ప్రస్తుతించెను. "మునీంద్రులారా! మహనీయులారా! భవదాగమనమువలన మాగృహంబు పావనంబయ్యె. నేను ధన్యుఁడనైతిని. మీమహత్వంబుఁ గొనియాడ నేనెంతవాఁడ! ఒక్కొక్కమహర్షిచేసినపని పరమాశ్చర్యకరమై యోగప్రభావమును వేనోళ్ళఁ జాటితీరుననుట నిశ్చయముగదా.

"సీ. ఊరుభాగమున భూభార మిమ్మనిదాల్చె
బ్రహ్మయష్టినె యుత్తపస్విపూనె
నల త్రిమూర్తులఁ బుత్రకులుగ నియ్యతిగాంచె
నలిగి వారల నమ్మహర్షి తన్నె
భువనసృష్టికి మాఱుపుట్టించె నిమ్మౌని
పూని యాయానమిరింగె భువనరాశి
దనయోగమహిమ నిత్తపసి క్రోధుజయించె
నడఁగ కుగ్రత నుగ్ర నతఁడుగెలిచె

తే. యోగమహిమంబులను మెచ్చ నొకరినొకరు
యోగమన్నను నవ్వ మనుందు రెపుడు
వింటి మీచర్యలెద మెచ్చుకొంటి; నిత్య
హర్షులను మిమ్ముఁగంటి మహర్షులార!"

ఆపలుకు లాకర్ణించి తాపసోత్తము లమందానందమునొం
ది, "రామచంద్రప్రభూ! మీరు రాజ్యభారధౌరేయులై యుం
డఁగా మాకుఁ గుశలమేయని వేఱె యడుగనేల? సాధుహింస
కుఁడును, పరాంగనాసక్తుఁడును, దుర్మదాంధుఁడు నైనదశకం
ఠుని బరిమార్చి లోకోపకార మొనరించిన మహనీయులు మీరు.
ఇంక మాతపంబుల కేవిఘ్నములు సంభవింపఁగలవు? మేమీ
మో మహాప్రజ్ఞావంతులమైనట్లు పొగడిరే. అది కేవలముతిశయో
క్తిగాదా? మీప్రభావముముందు మాదెంత!

"సీ. మునులపాలిటివాఁడవనుట కాదిననీవు
నవరించు యజ్ఞరక్షణమె సాక్షి

యతిపావనుఁడవౌట కల యహల్యాదోష
రాశి ద్రోచిన పాదరజమె సాక్షి
భువనాధికుఁడవౌట కవిరతోద్ధతి శూలి
విలుదళించిన బాహుబలమె సాక్షి
యఘటనప్రఘటనోద్యముఁడవౌటకు ఱాలు
నీటిపైఁ దేలించు నేర్పె సాక్షి
తే. యఖిలజీవేశ్వరుఁడవైన యందులకును
వనచరులచేతఁ దగువసల్ గొనుటె సాక్షి
యిట్టి నీకేము దీవింప నీవ్రతావ
మీయశముఁ గల్గెననుమాట కేమి సాక్షి?

సీ. ఖలశిక్ష సాధురక్షయు నొనర్పనెకదా
గురునాజ్ఞ వనినీవు దిరుగుటెల్లఁ
బగతుఖండింప నెపంబుగల్గనెకదా
సతినొంటివిడి వేఁట సనుటయెల్లఁ
గాందిశీకులఁ బ్రోచు కరుణజూపనెగదా
భానునందనునిఁ జేపట్టుటెల్ల
నేకాంతభక్తుఁడౌ టెఱిఁగియేల నెకదా
హనుమచే నుంగరం బనుపుటెల్ల
తే. గణన సేయక దశకంఠుఁ దృణముగాఁద
లంచియెకదా విభీషణు లంకకధి
కట్టకయె మున్ను పట్టంబుగట్టుటెల్ల
రవిసహస్రమహాస్సాంద్ర! రామచంద్ర!"

అని బహుప్రకారముల శ్రీరామునిమహిమ మనసార వ
ర్ణించి వర్ణించి, రావణచరిత్రంగూర్చియు నాంజనేయజననప్రభా
వాదులం గూర్చియు శ్రవణానందకరముగ నొకింతతడవు ప్ర
స్తావించిరి. రామరాజేంద్రుఁడు సంతోషభరితాంతఃకరణుఁడై
యామునిచంద్రులకు దండప్రణామము లాచరించి "మీరు నా
యందు దయగలవారై, నేనొనర్పఁదగు జన్నములకుఁ దప్పక రావల
యు" నని సవినయముగఁ గోరెను.

శా. వీనుల్ సౌఖ్యముఁజెందెమీవచనముల్ విన్నంతనే మిమ్ముస
న్మానంబొప్పఁగజూచి లోచనములానందించె, యుష్మత్పదా
ధీనుల్ సత్కృపఁజూడుఁడంచని సభక్తిన్ మ్రొక్కి దీవించి యా
మౌనుల్ వీడ్కొనిపోయిరంత రఘురామస్వామిహృష్టాత్ముఁడై.

ఉ॥ వారిగుఱించి కొంతవడి వర్ణనసేయుచునుండి విప్రులం,
బౌరుల, నిష్టబాంధవుల, భానుకుమారవిభీషణాదులం,
గూరిమితమ్ములన్, సఖులఁ, గొల్చినభృత్యుల సాదరాంచితో
దారమృదూక్తులంబనిచి తానును లోపలికేగె నయ్యెడన్.

కొంచెముధనమున్నను, కొంచెమధికారమబ్బినను, కొం
చెము విద్యకలిగినను సామాన్యముగా మానవులు గర్వాంధు
లై తమంతవారు లేరని నిక్కి నీలుగుదురుగదా. కాని యఖం
డైశ్వర్యయుక్తుఁడును, సకలరాజాధిరాజును, సర్వవిద్యాధురీణుఁ
డు నగుశ్రీరామచంద్రమూర్తి యెంత వినయసంపన్నుఁడో,
యెంతశాంతవంతుఁడో, యెంతనిగర్వచూడామణియో, యెంత
వివేకశాలియో గ్రహించితిరా, చదువరులారా!

# మూడవప్రకరణము

"సీ. చోరవై వారాశిదూఁటి చోరనిఁజీరి
మీఁటు చారువిహార మేలుకొనుము
మేటితాఁబేటిబూమెలిం పూని మంథాన
శైలమెత్తినధీర మేలుకొనుము
ఘోణివై పంభృతక్షోణివై రిపుయుద్ధ
కేళిఁగూల్చినశూర మేలుకొనుము
భక్తుమాటలఁబట్టి బలుకంబమునఁబుట్టి
మెఱసిననరసింహ మేలుకొనుము
తే. లీలవటువృత్తిఁగనుధన్య మేలుకొనుము
మేదినీశ ప్రమర్దన మేలుకొనుము
శూలికోదండఖండన మేలుకొనుము
నీలనీలాంబుదశ్యామ మేలుకొనుము."

అని వందిమాగధులు తన్నుఁ గీర్తించుచుండ, రామరాజశిఖామణి ప్రతిదినము సూర్యోదయముకంటె ముందు మేలుకాంచి కాలోచితకృత్యము లొనరించి, యర్హరీతిభూషణాంబరాదుల ధరించి, కొలువుకూటంబునఁ బేరోలగంబుండి, రాజధర్మములన్నియు యథావిధి నిర్వర్తించుచుండెడివాఁడు. నృపులు, మంత్రులు, కవులు, కవులు, పండితులు, నియోగులు, భృత్యుల మొదలగువారందఱు రామచంద్రునివంటి రాజశేఖరుని గొల్చుభాగ్యమబ్బినందులకు సంతోషమున నుప్పొంగుచుండిరి

"క. తండ్రికి ప్రియ రామచంద్రుఁడు
తండ్రులమఱపించి ప్రజలఁ దా రక్షింపన్
దండ్రుల నందఱు మఱచిరి
తండ్రిగదా రామచంద్ర ధరణిపుఁడనుచున్."

రామభద్రుఁడు సర్వజననయనాభిరాముఁడయ్యె. రామస్వామి యఖిలహృదయసింహాసనాసీనుఁడయ్యె. రామరాజ్యము దిగంతవిశ్రాంతకీర్తిమంతమయ్యె. రామచరిత్రము నిఖిలకర్ణోత్సవదాయియయ్యె. రామనామము సకలజిహ్వాగ్రవర్తియయ్యె. దేశమంతయు శ్రీరామమయమయ్యె. ఒక్కమాటామహానుభావుని దర్శించిన భూపాలు రాశ్చర్యానందనిమగ్నులై నిజనగరంబులకుఁ బోవలయునన్నమాటయే లేక రామపదసేవారతులైరి. పౌరులును దమతమ గృహకృత్యంబులఁ బాటింపక నిత్యము రామ సందర్శనాయత్తచిత్తులైరి.

శా. ఆరామక్షితినేత చెల్మి, వినయం బౌదార్య మైశ్వర్యముం
దారుణ్యంబును జెల్వుమెచ్చినృపులాత్మప్రాజ్యసామ్రాజ్యర
క్షారంభంబులుమాని, దర్శనవిధాయత్తాత్ములైయుండి ర
ప్పౌరుల్, జానపదాదులొండొకపనుల్ పాటింపరెప్పట్టునన్.

క. ధ్యానములమాత్రమునఁ బర
మానందమొసఁగు బ్రహ్మమాకారముతోఁ
గానంబడినను, జూచిన
మానవు లానందవార్ధిమగ్నులుగారే.

ఇట్లు కతిపయదినము లేగినవి. పట్టాభిషేకమునకు వచ్చిన జనకాదిరాజపుంగవు లింకను స్వస్థానంబులకుఁ బోవలయునన్న చింత లేకుండిరి. ఒకనాఁడు శ్రీరామమహారాజు జనకనృపాలుఁ జూచి "మామగారూ! మీరు ప్రజలనందఱను గన్నతండ్రిపోలికఁ బాలింతురుగాన మీజనకనామము సార్థకమయ్యె. నేను శత్రుసంహార మొనరించి సీతతోఁగూడి సౌఖ్యాబ్ధిఁదేలుభాగ్యమొందినది మీయనుగ్రహముచేతనే గదా! మామగారనుటయే గాని మీకును మాతండ్రియైన దశరథమహారాజుగారికిని భేదమేమియును లేదు.

చ. జనకుని కైవడిం బ్రజల సంతతముం దయఁజూచి ప్రోవఁగా
జనకసమాఖ్య మీ కలరె; శాత్రవశిక్ష యొనర్చి సీతతో
ననుపమసౌఖ్యమేఁ గనినదంతయు మీకృపఁగాదె? మామగా
రనుటయె గాని మాదశరథావనిభర్తకు మీకు భేదమే.

అట్టి మీరెన్నిదినంబు లిక్కడనున్నను మాకు శుభమే యగునని నేను వేఱె పలుకనక్కఱలేదుగదా. కాని, మీరు దయతో మమ్ముఁ జూడవచ్చి పెక్కుదినములగుటచే మీ రాజ్యములోనిప్రజలు మిమ్ముఁ జూడవలయునని యెంతగా నువ్విళ్లూరుచున్నారో! చనువుచేసట్లు మనవిచేయుచున్నందున క్షమింపుఁడు. మీరు మీనగరంబున కేగినను మాయందు మీకున్న కటాక్షముమాత్రము వీడవలదుసుండీ" అని భక్తివినయములొప్పారఁ బలికి, దివ్యమణిమయభూష లొసఁగెను. మిథిలాధినాథుఁ డల్లుఁ డిచ్చిన రత్నభూషణాదులు ప్రీతితో స్వీకరించి "రాజచంద్రా!

ఈబహుమానములేటికి? "మామగారూ" యని నన్ను గౌరవానురాగములతోఁ బిలుచుటయే నాకుఁ బదివేలు. నీవు సాక్షాద్విష్ణుమూర్తివి. సీత లక్ష్మీదేవి. మీప్రేమకంటె నాకుఁ గావలసిన దేమున్నది? మీమహిమఁ దలఁచుచు నూరికిఁబోయి వచ్చెదను" అని సరసముగనుడివి రాముని వీడ్కొని, రామాజ్ఞఁ దనవెంట భరతుఁడుండ, నిజనగరంబున కేగెను.

తండ్రిగారియం దెంతభక్తిగలదో మామగారియందుఁ గూడ నంతభక్తిగలశ్రీరామమూర్తి కెవరుసాటి?

# నాలుగవప్రకరణము

"మ. ధరణీపుత్రి నిజాంకపీఠమున, నుద్యద్భక్తి వాతాత్మజుం
డరయన్ మ్రోలను, బార్శ్వభాగముల నాహ్లాదంబునన్ సోదరుల్,
సొరిదిన్నల్గడలందు నందమెసఁగన్ సుగ్రీవసక్తుంచరే
శ్వరతారాసుతముఖ్యనాయకులు గొల్వన్ రత్నపీఠంబున
న్గరమొప్పన్ వెలుఁగొందు నిన్నుఁగన నెన్నండబ్బు సీతాపతీ!"

శ్రీరామచంద్రమూర్తి జనకరాజర్షిని సత్కరించి మిధిలకుఁ బంపినయనంతరమునఁ దక్కుంగల ధరణీశ్వరుల సాదరంబుగ నవలోకించి యిట్లనియె: "భూనాయకులారా! మీబలపరాక్రమవిశేషంబున దశకంఠుఁడు మడిసెను. నేను గారణమాత్రుండనగుటయేతప్ప నంతకంటె నాయం దేయాధిక్యము లేదు. నేను మీలో నొక్కఁడనే. కావున మీరు నాయెడఁగల

ప్రేమభావము వీడక, మీమీ రాజ్యంబులకేగి యథాప్రకారము ధర్మపరిపాలన మొనరింపుఁడు.”

మ. ధరణీనాయకులార మీభుజబలోద్ధత్యంబునం బంక్తికం
ధరుఁ డీల్గెఁ వినుఁ డేను గారణము మాత్రంబింతె మీలోన నొ
క్కరుఁ డట్లే నా యెడ నెయ్యముంచి నయమార్గంబొప్ప మీ
మీధరల్
పరిపాలింపఁగ నింకఁ బొండని సుధాప్రోక్తులం బల్కినన్.

ఈపలుకుల కవనీనాథులందఱు నపరిమితానందభరితు లగుచు ముకుళితహస్తులై సర్వశుభదాయకుఁడైన రఘునాయకు ననేకవిధంబులఁ గొనియాడిరి.

“సీ. అఖిలభూతమయుండవగుట నీవిజయముం
జటిజయంబనుట తథ్యంబకాదె
యొకటికినననేల సకలంబునకు హేతు
వైయుండు దదియుఁ దథ్యంబకాదె
యంతరాత్ముఁడవై యందఱిలో నొక్క
యాకృతినునికి తథ్యంబకాదె
నీయందు నెయ్యముల్ నిలుపుట నయమార్గ
మౌనన్నమాట తథ్యంబకాదె

తే. విభుఁడవయ్యును మానుషవిగ్రహంబు
దాల్చి వెలుఁగొందు నీయాజ్ఞఁ దలలమోచి
పోయివచ్చెద మించుము పూర్ణకరుణ
రాజదేవేంద్ర! దశరథరామచంద్ర!”

రామరాజచూడామణి వారల కుచితబహుమానము లనేకంబు లొసఁగి, పిన్నతమ్ముని వారలవెంటఁ బంపెను. ఆభూపాలురు రామునిసత్కార్యములను, సద్గుణసంపత్తిని బహుప్రకారంబులఁ గీర్తించుచుఁ, దమతమ రథగజతురగాదులతోను, భటవర్గంబులతోను మహావైభవంబెసఁగ నిజపురంబుల కేగిరి. కొలఁదిదినములు గడచిన వెనుక, భరతలక్ష్మణాదు లాయానృపాలకు లంపినట్టి కానుకలం దీసికొనివచ్చి, చెలువుమీఱఁ గొలువున్న రాఘవస్వామికి భక్తిపూర్వకముగ సమర్పించిరి. ఆయన కొన్ని యనర్ఘభూషణంబులు చేకొని సుగ్రీవవిభీషణాదులకిచ్చి, చిఱునవ్వుతో "తాతా! నీకిది తగును, పుచ్చుకొను" మనుచు నొక ముత్యాలహారము భల్లుకేంద్రున కొసఁగెను. ఉరములహారములు, కరముల నుంగరములు, శిరములఁ గుళాయిలు ధరించి వానరముఖ్యులందఱు నలరుచుండిరి. రామప్రభువు వాలిపుత్రుండైన యంగదుని, వాయుపుత్రుండైన హనుమంతునిఁ దనతొడలమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని, స్వయముగ నిద్దఱను దివ్యవస్త్రాలంకృతులంజేసి సుగ్రీవునిదిక్కు మొగంబై "కపిరాజా! నన్నుఁ గొలుచుటచేతనేగదా కపులందఱు నద్భుతకార్యము లాచరించి వన్నెకెక్కిరి. నీకుమారుఁడు నాంజనేయుఁడు నెంతగారవంబునకైన నర్హులుసుమీ" యని పలికెను.

"శ్రీరామచంద్రప్రభూ! వీరలందఱు నింతంతవారగుటకుఁ గారణము మిమ్ము సేవించుటయెగాని, నన్నుఁ గొలుచుటకాదు.

సీ. శాఖశాఖల నెక్కు శాఖామృగములకు
హేమాసనములపై నెక్కఁగలిగె
వల్కల కౌపీనవంతులౌ కపులకుఁ
బట్టాంబరమ్ములు కట్టఁగలిగె
వనభూరజము గప్పికొని మెలఁగు వనాటు
లకుఁ జందనాదు లలందఁగలిగె
ఫలమూలములుతిని బ్రతుకు మర్కటులకు
మేలోగిరంబులు మెక్కఁగలిగె
తే. నొడల నేపోఁడిమియు లేకయున్న వలిము
ఖులకుఁ గటకాదికము లూనుకొనఁగఁగలిగె
నటవిచరులకుఁ బురిఁ దిరుగాడఁగలిగె
శ్రీరఘూత్తమ నినుఁ గొలిచినకతమున.

స్వామీ! మీయనుగ్రహ మున్నచోఁ దృణమైనను మేరువగును. మీకరుణతప్పినచో మేరువైనను దృణమగును. మీకృపతలఁచిన నీవానరు లెంత" యని వనచరనాయకుఁడు వినయముతో విన్నవించెను. "మిత్రమా! నీవు నీవారిని మెచ్చుకొనవుగాని, వీరిప్రభావము నే నెఱుఁగనా? సత్యమువచింపవలయునన్న వీరందఱు సహజగాంభీర్యనిధులు, ధైర్యసాహసనంపన్నులు. వీరిపనులు పరమాశ్చర్యకరములు. నేఁజేసిన దేమున్నది?

సీ. ఘనభూమిభృచ్ఛిరోగ్రము లెక్కు ఘనులకు
నీచిన్నిగద్దియ లెక్కు యెంత

బలుకాంతిఁ బరమేశు వలువలుగప్పెడి
ఘనుల కీజిలుఁగులు గట్టుటెంత
తుల లేని శుభవాసనలమించు ఘనుల కీ
యలఁతితావులగంధ మలఁదుటెంత
యమృతాశనుల సామ్యమందినఘనులకు
నికృష్టుడు చవిగొని మెక్కుటెంత
తే. యధికగుణరత్నభూషితులైన వీరి
కీవిభూషణతతులు వహించుటెంత
యఖిలజగముల నపత్రిహతరయమునఁ
దిరుగువీరల కీపోలిఁ దిరుగుటెంత.

చ. "వననిధులన్నియుం గలఁచినైవ, వసుంధరఁ బెల్లగింప, సూ
ర్యుని దిగమ్రింగ, ఘోరలయరుద్రునినైనను మార్కొనంగ
నోపినఘను లీమహాకపులు భీతివహింపుదురే మహాత్మశా
సనమున కట్టియాజ్ఞగలశౌర్యసిద్ధిని నిను నెంచశక్యమే."

అని సీతారమణుఁడు తనసహాయోదార్యగరిమ వెల్లడించి సుగ్రీవుని గొనియాడి, విభీషణుని లాలించి, వానరుల కెంతో వేడ్కఁబుట్టించి యెల్లరులకుఁ బ్రియుఁడై యొప్పారుచుండెను. ఆహా! ఏమి యాసౌజన్యము! ఏమి యాయనుకువ! ఏమి యామాటలనేర్పు! శ్రీరామచంద్రమూర్తివంటి రాజును గన్నులారఁ గాంచి, చేతులారఁబూజించి, మనసార సేవించి యానందించు భాగ్యము మన కెన్నఁడుపట్టునో గదా!

# ఐదవప్రకరణము

"ఉ. రాముఁడు రక్షకుండు, రఘురామునినమ్మిన బంట నేను; నా
కేమిభయంబు? చింతిలఁగ నేటికి? నేమిఘటించినన్ రఘు
స్వామిదికీర్తి: సత్యమిది సత్యము; మాటలువేయు నేల? నే
నీమహనీయకీర్తి విని నిన్నును నమ్మితి జానకీపతీ."

రామరాజమందిరములోనుండి, పెక్కుదినము లొక్క నిమిషంబుగాఁదోఁప, వానరులెల్లను నానందాబ్ధి నోలలాడుచుండిరి. కొంతకాలము గడచినది. ఒక్కనాఁడు, దాశరథి సుగ్రీవుంజూచి "చెలికాఁడా, నీవు నాకొఱకనేకకష్టములోర్చి సాహాయ్యము చేయుటచేతనే నాకు విజయలక్ష్మి చేకూరెను. నే నీకెంతయుఁ గృతజ్ఞుఁడను. ని న్నిప్పుడు వేఱెపొగడనేల! కాని యొకమాటమాత్రము చెప్పఁదలఁచితిని. నీవిటకువచ్చి చాల రోజులయ్యెను. కావున నీవిఁక నూరికిఁబోయి రాజకార్యములు యథావిధి నెఱవేర్పవలయునుగదా. నా కుపకార మొనరించుటకై నీవలెనే యీహనుమంతుఁడు, నంగదుఁడు, జాంబవంతుఁడు, నలుఁడు, నీలుఁడు, శరభుఁడు, సుషేణుఁడు మొదలగువానరవీరులందఱుఁ బడరానిపాట్లు పడినవారగుటచేత వీరినెల్లప్పుడును గాపాడుచు సుఖించునట్లు చేయుము. ఇంతకంటె నేను గోరునదేదియును లేదు. మున్ను వాలిచేసిన దుష్కార్యము లెంచక కరుణార్ద్రహృదయుండవై కిష్కింధ కేగి యంగదునిఁ గన్నతండ్రికరణిఁ జూచుట నీకు ముఖ్యవిధి. ఈసంగతి నెన్నఁడు మఱవకుమా. నీకుఁ దెలియనిధర్మము లేదుగానినామనస్సులోనున్న

దాని నాఁపుకొనలేక యిట్లు వెలిబుచ్చుచున్నాఁడవు. పోయి రమ్ము, మిత్రమా" అని యానతిచ్చి విభీషణుఁజూచి "మహాత్మ! నీవు పుట్టినప్పుడె వినయధర్మవివేకములు నీతల్లి నీకు వెన్నతోఁబెట్టెనుగాన నేను బోధింపవలసిన దేమియునులేదు. ఐనను నీకుఁ బ్రాణమిత్రుఁడనగుటచే నాయభిప్రాయము వెల్లడించుట కర్తవ్యముగావున నొకమాట చెప్పెదను. జ్ఞాపక ముంచుకొనుము. నిన్నుఁగొలుచువారలా క్రూరరాక్షసులు. మనస్సు చంచలమైనది. కాలమా యొక్కరీతినుండక యనేకవికారములొందుచుండును. నీవుమాత్రము నీయన్నయైన రావణునియెడఁ గ్రోధభావములేక ధర్మరతుఁడవై లంకారాజ్యము ప్రజారంజకముగఁ బరిపాలింపుము. ఆచంద్రతారార్కమైన సత్కీర్తి ప్రాప్తించును." అని హితవుగఁబల్కెను.

క. మఱవకు నీతివినీతుల
మఱవకు మామీఁదిప్రేమ, మనకపివరులన్
మఱవకు, నీతలిదండ్రుల
మఱవకుమని రఘుకులాబ్ధిమణి దెల్పుటయున్.

శ్రీరామమహారాజవాక్సుధారసధారలఁ గర్ణపుటంబులం గ్రోలి యింతింతనరాని సంతసముతో, వనచరరక్షోవరులందఱు నేకగ్రీవంబుగ సకలసాగరంబు లొక్కపరి మ్రోయు నరణి రామప్రభు నిట్లు వినుతించిరి. "మహాప్రభూ! నీబుద్ధి, నీసూక్తి, నీబలిమి, నీయందము, నీధైర్యము నిరుపమానములు గావునఁ దృప్తికరముగ వర్ణింప నెవరితరము? ఎంతదుష్టునియం

దైన గుణలేశమున్నఁ దానినిమాత్రమే మెచ్చి గ్రహించు సత్స్వభావసంపన్నుఁడవనియుఁ, గష్టమురానీ, సుఖమురానీ, ఆడినమాట తప్పక నెఱవేర్చితీఱు సత్యవ్రతుఁడవనియు, నెంత హీనుఁడైనను నిన్నాశ్రయించినచో వానిని నీతమ్మునిఁజూచి నట్లే చూచు నుదారగుణభూషణుఁడవనియు, నమ్మి సేవించు వారిని శాశ్వతసౌఖ్యవంతులఁజేసి రక్షించు కరుణాళుండవనియు నీవారు, పెరవారు నను భేదము పాటింపక ప్రజలనందఱను గన్న తండ్రికరణిఁ బ్రోచు రాజశ్రేష్ఠుండవనియు సకలలోకంబులు నిన్నెల్లవేళలఁ గీర్తించుచుందురుగదా. అట్టి నీమహిమఁ బొగడ మేమెంతవారము? మాపూర్వజన్మసుకృతవిశేషంబున మీ పాదసేవ మాకిప్పుడు లభించినది. మామనంబు లెప్పుడును మీయందు లగ్నములైయుండునట్లనుగ్రహింపుము, స్వామీ.

సీ. శతబృహస్పతులైన సవతుగా రొక బృహ
        స్పతి యీమనీషకు సాటియగునె
    వేమంది యజులైన నేమాత్రమోకాక
        యొకయజుం డీసూక్తి కుపమయగునె
    లక్షశేషాహివల్లభులైన నేమొకా
        కొకశేషుఁ డీబల్మి కద్దియగునె
    కోటిమన్మథులైన దీటుగా రొకమన్మ
        థుం డీ చెలువునకుఁ దుల్యుఁడగునె
తే. తలఁప శతకోటిమేరుభూధరములైనఁ
    బోల్పఁదగుఁగాక యొకమేరుభూధరంబు

పోల్ప నీధైర్యలక్ష్మికిఁ బోల్కి యగుచు
రవికులాంభోధిచంద్ర! శ్రీరామచంద్ర!
సీ. ఎన్నిదోషములున్న నెంచక యించుక
గుణమున్న మెచ్చి చేకొందువనుచుఁ
బాటించి పలికినపలుకు బ్రహ్మవరంబు
గాఁ బ్రతిష్ఠకుఁ దెచ్చు ఘనుఁడవనుచు
హీనుఁడైన సమాశ్రయించినఁ దమ్ముని
జూచినచందానఁ జూతువనుచుఁ
గొలిచినవారిని గూర్మి నాచ దార్ఢ్య
ముగ సాఖ్యము లొసంగి ప్రోతువనుచుఁ
ఆ. బరులు స్వజను లనక ప్రజలనందఱఁ గన్న
ప్రజలలీలఁ బ్రోచు ప్రభుఁడవనుచు
నీగుణంబులెంచు నిఖిలలోకంబులు
రమ్యగుణసముద్ర! రామభద్ర!"

## ఆటవపరికరణము

"క. శ్రీరామ నీకథామృత
ధారలు కర్ణాంజలులను దావిపెడిధన్యుల్
కోరుదురే యమరత్వము
తాలుదురే జన్మమరణ దారుణరుజలన్!"

"రామప్రభూ! నీచరిత్రమును నమృతమును చెవులఁగ్రోలు వారల కింక నేకోరికలుండవు. జననమరణ బాధలు కలుగవు.

నిత్యానందభాగ్య మబ్బును. మీకథ యీభూలోకమున నెంత కాలము చెప్పఁబడుచుండునో యందాఁక నేనీశరీరముఁ బాయ కుండునట్లును, మీపాదసేవ చేయునట్లు ననుగ్రహింపవే. మీ కథ లెప్పుడు వినుచు మీపదముల ధ్యానించుచు, మీ సుగుణములఁ దలఁచుచు, మీప్రభావమును గీర్తించుచు, జీవించిన నాజన్మము సార్థకమగునుగాని, మఱియొకవిధమున నెంతకాలము బ్రతికిన నేమిప్రయోజనము?

సీ. కౌసలేయ త్వదీయకథ లూఁకొనని పాస
రంబు కల్మషధూసరంబుగాదె
తాటకాంతక నిన్ను ధ్యానంబుసేయని
క్షణము నివారితక్షణముగాదె
జానకీరమణ నీస్మరణఁబొనర్పని
ఘటిక విషాపూర్ణఘటికగాదె
సాకేతనిలయ యుష్మత్పూజ సలుపని
జాము మృత్యువునిల్చు గీముగాదె
తే. శ్రీరఘూత్తమ నిన్ను దర్శింప కరక
కడచుకాలంబు, గాలంబుకరణిఁగాదె
రామ, యటుగాన నిన్నునారతము వినుట
దలఁచు టస్మాదృశుల కుచితంబుగాదె.”

అని పరమభక్తుండైన యాఁజనేయుఁడు చేతులు జోడించి రఘుస్వామిని బ్రస్తుతించెను. అప్పుడు ప్రభువర్యుఁ డపరిమితానందభరితుఁడై, గద్గదయుడిగ్గి, మారుతిని కౌఁగిలించు

కొని, కోరినవరములు ప్రసాదించి "నాయనా! చిరాయురారోగ్య సౌఖ్యంబులొంది సుఖింపుము. ఈభూమండలంబున్నంతకాలము నీకీర్తియు నిలుచును. నీవు నాకొనరించిన మహోపకార మెన్నఁడు మఱవలేను. నీ వేయాపదలులేని మహానుభావుఁడవుగాన నేను నీకుఁ బ్రత్యుపకారము చేయఁగలిగిన సమయ మెన్నఁడు రాదు. ఇంక నీఋణ మెట్లుతీర్చుకొనఁగలను? పావనీ! నీకును నాకును భేదములేదు. నీవు నాలో నుందువు. నేను నీలో నుందును. నిన్నుఁబూజించువాఁడు నాకుఁ బరమప్రియుఁడు. అప్సరస లనవరతము నీకథలు మనోహరంబుగఁ బాడుదురు. యశోవిశాలుఁడవై హాయిగా మనుము" అని దీవించి తనమెడనుండి మెఱయుచున్న రత్నహారము తీసి పరమపావనుఁడైన పావనికంఠమున నుంచెను. ఇట్లు రామచంద్రమూర్తి, యాశ్రితాళికెల్లఁ బ్రశస్తభూషణాంబరాదు లపారముగా దయచేసి తమతమ తావులకుఁ బోవ సెలవిచ్చెను. కాని వారిహృదయములు దుఃఖపూరితములయ్యెను. పోవుటకుఁ గాళ్లాడలేదు. మాటాడఁదలఁచియుఁ బెదవులుమెదల్పలేకపోయిరి. ఔను! శ్రీరామచంద్రమూర్తివంటి దయామయుఁడైన రాజోత్తముని బాయవలసియుండుట యెంత సంతాపకరమో యనుభవైకవేద్యమేగాని మాటలలోఁ దెలుప నెవరితరము?

"రఘురామచంద్రా! నిన్నెట్లువీడిపోదుము? అయ్యో, మమ్ము మాస్థలములకుఁబంపివేయుచున్నావా? మరల నిన్నుఁజూచు భాగ్యము మాకెన్నఁడుగలుగునోగదా! కటకటా! మాకన్నులెంతపాపముచేసికొనినవి! మీసుధామధురాయమానంబులగు

వాక్కులు మరల నెప్పుడువిందు మోగదా! రామచంద్రా! దయ
యుంచుము. సీతమ్మతల్లితో మమ్ము మఱవవద్దని చెప్పుము" అని
యెట్లో రెండుమాటలుపల్కి, రెండడుగులువైచుచు, మరల
వెనుకకువచ్చుచు "రామా! రామా" యని పిలుచుచు నిట్లు
రామవియోగజనితశోకము పలువిధంబుల వెలిపుచ్చి చంటిబిడ్డ
లవలె నేడ్చుచు సుగ్రీవవిభీషణాదులు స్వస్థలంబులకు వెళ్లలేక,
వెళ్లలేక వెళ్లిరి.

చ. వలవలగన్నులందొఱఁగు బాష్పకణంబులతో రఘూత్తముం
బలుమఱుఁజూచుచుఁ నిలిచి "పంచితివే రఘురామచంద్ర మా
స్థలముల" కంచు మూఘలవిధంబున నేడ్చుచుఁబోయి రెంతయుం
గళవళపాటుతోఁ గరుణగల్గినరాజును బాయఁగూడునే.

రవికులతిలకుండీకరణి రవిసుతాదులను వీడ్కొల్పి, వా
రిశౌర్యధైర్యములను మాటిమాటికి నెంచుచు, బంధుమిత్రా
నుజులు గొలువ నపరాహ్ణముదాఁక సభాంతరమున వసించి
యుండెను.

# ఏడవ ప్రకరణము

"ఉ. శ్రీరఘురామ, చారుతులసీదళదామ, శమక్షమాదిశృం
గారగుణాభిరామ, త్రిజగన్నుతశౌర్యరమాలలామ, దు
ర్వారకబంధరాక్షసవిరామ, జగజ్జనకల్మషార్ణవో
త్తారకనామ, భద్రగిరిదాశరథీ! కరుణాపయోనిధీ."

అయ్యవసరంబునఁ నొక్కదివ్యమూర్తి యాకసంబున నిల్చి "దేవా! నేను ధనేశునిపుష్పకంబు. మీపాదపద్మములవలు కొలువవచ్చితిని. యక్షరాజు మీసౌజన్యము మెచ్చి మీసేవ చేయ నన్నుఁబంపెను. కరుణించి నన్ను గ్రహింపుము" అని శ్రీరామచంద్రమూర్తిని బ్రార్థించెను. "అట్లే కానిమ్ము. నీకంత యభిలాషగల్గినపుడు వలదని నేనుజెప్పిన దోషమగునుగదా. నీ విప్పుడు నీకనుకూలమగు స్థలమునకేగి నేనుదలఁచినప్పుడురమ్ము. మమ్ము మఱవకుము" అని దయాసముద్రుండైన రామభద్రుఁడు ప్రీతిపూర్వకముగఁ బలికెను. దేవయానము సంతోషమున నుప్పొంగుచు నాకృతలక్షణుఁడగు బ్రదక్షిణము చేసి దక్షిణ దిశఁ బోయెను. అంతట రాఘవస్వామి సంతుష్టాంతరంగుఁడై "ఆహా! కుబేరుఁ డెంతయోగ్యుఁడు! నాస్నేహముఁగోరి, తన విమానమునే యొసఁగినాఁడే? కడుబలవంతుఁడు, నైశ్వర్యవంతుఁడు, సుగుణవంతుఁడు నగు నమ్మహనీయుని చెల్మి యబ్బుట మనయదృష్టముగదా" అని రారాజును బ్రశంసించెను.

అప్పుడు భరతుఁడు రామునితో "దేవా! మీబలపరాక్రమవిశేషమున రావణాసురుఁడు మడిసెనుగాన హర్షించి ధన

రాజు విమానమణిని మీకు బహుమానముగాఁ బంపెను. పుష్పకము మిమ్ము సేవింపకున్నచో, మున్ను దశకంఠుని మోచిన దోషముఁ బోఁగొట్టుకొనఁగల్గునా? మీగుణసంపత్తి యెట్టిదో యెఱుఁగనివారుగాని, యెఱిఁగి మిమ్ము భజింపఁగోరనివారుగాని లోకములో నేఁడును లేరు. ఒక్క కుబేరుఁడే యననేల, దిక్పాలురెల్లరు మీచెల్మి వాంఛించువారే. వాంఛించుటయేగాక, తమకున్న యైశ్వర్యబలాదులన్నియు మీకృపవలన సంప్రాప్తించినవని యెంచుచు మిమ్మెట్లు సంతోషపెట్టఁగలమో యని సర్వదా తమమనంబుల యోచనసేయుదురు. మీమహిమ మీరు చెప్పికొనరుగాని జగత్ప్రసిద్ధముగదా! మీపరిపాలన మెంత ప్రశస్తముగానున్నదో, ప్రజలందఱు నెంతసౌఖ్య మొందుచున్నారో, మీకీర్తిదుందుభి యెట్లు మ్రోగుచున్నదో వర్ణింప నలవిగాదు.

సీ. నిర్జరాధీశుండు నెల మూఁడువానలు
కోరినధర నెల్లఁ గురియసాగె
జ్వలితప్రదక్షిణార్చులతోడ హవ్యంబు
నేవేళ వహ్ని వహింపఁదొడఁగె
మిక్కిలి ముదుసళ్లఁ దక్కఁ దక్కినవారిఁ
బొలియింప శమనుండు పూనఁడయ్యె
వీచికాగ్రముల నవీనమణుల్ ప్రోని
నీరధితటముల నిండనించె

తే. శైత్యసౌరభ్యమాంద్య సంచారియగుచు
గంధవహుఁ డెల్లప్రాణుల గాసిమాన్పఁ
బడినగింజల ననలెత్తి పండె ధరణి
రఘుకులోత్తంస మీ రేలు రాజ్యమునను.

సీ. సుతులు లేకకలంగు సుదతు లెక్కడ లేరు
సుతవియోగముఁ జెందు సతులు లేరు
పతులఁ బాసిన కళావతు లెయ్యెడను లేరు
పడఁతులఁ బాసిన పతులు లేరు
దారిద్ర్యదుఃఖసంతప్తు లెందును లేరు
కలిమిగర్వముఁ జెందు ఖలులు లేరు
వ్యాధుల నాధుల వగచువారలు లేరు
నిందలొందినవార లెందు లేరు
తే. లేరు జారులు, చోరులు లేరు, దుర్వి
చారు లగ్నిజలాహితృష్ణాక్షుధాది
వాతదుర్భిక్షభయులైన వారు లేరు
రఘుకులోత్తంస మీ రేలు రాజ్యమునను.

రఘుకులతిలకా! వేయుమాటలేల, యిది త్రేతాయుగమయ్యును కృతయుగముకరణి నొప్పుచు సర్వప్రజారంజకంబుగా నున్నది” అని సుధామధురరీతి సంభాషించెను. జానకీవల్లభుఁడు మందహాససుందరవదనారవిందుఁడయ్యెను.

# ఎనిమిదవ ప్రకరణము

"శ్లో. ఇక్ష్వాకువంశార్ణవజాతరత్నం
సీతాంగనా యౌవనభాగ్యరత్నం
వైకుంఠరత్నం మమభాగ్యరత్నం
శ్రీరామరత్నం శిరసానమామి."

ఇట్లు సుగుణసాంద్రుఁడైన రామచంద్రుఁడు సర్వజన పూజ్యంబుగ రాజ్యంబుఁ బాలించుచుండెను. పూతచరిత యగుసీతయుఁ బతిసేవానిరతయై యతులసౌఖ్య మనుభవించు చుండెను.

గీ. సిగ్గువడుటగల్గి సింగారమునుగల్గి
భక్తిగల్గి చాలభయముగల్గి
నయముఁ బ్రియముఁగల్గి నరనాథుచిత్తంబు
సీత తనకు వశముచేసికొనియె.

ఏకపత్నీవ్రతుఁడైన మహనీయుఁడుగావున రామరాజ మౌళి సతియం దనుపమానురాగంబుగలిగి యామె కెల్లవిధం బుల నాహ్లాదకరంబగురీతి వర్తించుచుండెను.

"సీ. కలపంబు లభినవగంధంబులుగఁగూర్చి
తనువల్లిఁ గప్పయంగఁ దానయలఁదుఁ
బువ్వులు బహువిధంబుగఁగట్టి ముడికొక
భంగిగా నెత్తుటువట్టియిచ్చు
హారముల్ మెఱయ నొయ్యారంబుగా గ్రుచ్చి
యందంబు వింతగా నలవరించు

మృగమదపంకంబు మృదువుగా సారించి
తిలకంబు పెట్టి నెచ్చెలికిఁజూపు
గీ. జనకరాజతనయ మనముదలిర్పంగ
వివిధనిపుణలీల వెలయునిట్లు
చతురముగ నొనర్చు సౌభాగ్యసారాభి
రామమూర్తి యగుచు రామవిభుఁడు."

సీ. స్నానసంధ్యాహోమ దానాదికృత్యంబు
లర్హకాలములందె యాచరించి
యంబరాభరణమాల్యానులేపనముల
సమయోచితస్ఫూర్తి సంగ్రహించి
భోజనపానతాంబూలాదికములు దే
హానుగుణమ్ముగా నవధరించి
వ్యసనంబులందుఁ గేవలసక్తి జెందక
సవియును దగురీతి ననుసరించి
తే. జాతిచేష్టాగుణేంగిత రీతులెఱిఁగి
సీతనేలుచుఁ బ్రజల రక్షించుచును, స
హోదరులఁబ్రోచుచును దల్లు లుత్సహింప
వసుధఁ బాలించె రఘువంశవల్లభుండు.

కొంతకాలము గడచినతరువాత సీతాదేవి గర్భంబు దాల్చి నూత్నవికాసమున నొప్పుచుఁ బ్రాణనాథునకు మరింత యుల్లాసముఁ గలిగించెను. ఒకనాఁ డక్కాంతారత్నము కాంతు చెంత సంతసమునిూఱ నేకాంతమున మెలఁగుచుండ నతం డానంద

కందళితహృదయారవిందుఁడై "ప్రాణేశ్వరీ! నీమనంబున నేదే నికోర్కెయున్నఁ దెల్పవే. సతి గర్భిణిగానున్నప్పు డామె వాంఛితము నెఱవేర్చ పతి యట్లు చేయవలయునుగదా. కావున నా మాట మఱువక యేది నీకుఁ బ్రియంబో వెల్లడింపుము" అని తేనియతేటలైన మాటల జానకిని వేఁడెను. ఆమె కొంతతడవు సిగ్గుపడియు నెట్టకేలకు వేడ్కతో నాథునిఁజూచి గంగానదీ తీరారణ్యములలో వసించు మునిపత్నులతో ఫలాహారంబులు గొని యొకనాఁడు వారితోఁ గలిసిమెలసి తిరుగఁగోరెదను. అచ్చటియందంబులఁ గన్నులారఁ గాంచిరావలయునని నామనంబువ్విళ్ళూరుచున్నయది" అని పలికెను.

రఘువరేణ్యుఁ డందులకు సమ్మతించి "ప్రియా! నీవు కోరినట్లుచేయు టెంత పెద్దపని? నిన్ను శీఘ్రంబ పావనగాంగ భూములకుఁ బంపెద" నని ప్రీతితో సెలవిచ్చెను.

ఆహా! దాంపత్యమన సీతారాములదే గదా?

---

# తొమ్మిదవప్రకరణము

శ్లో. రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః.

అహుగో! శ్రీరామమహారాజు! నవరత్నపీఠ మలంకరించి మంత్రిబంధు హితాప్తసామంతవరులును, భద్రసుమంత్రకా

శ్యపప్రముఖ నర్మసఖులును గొలువఁ జుక్కలలోఁ జంద్రునివలె నెట్లుప్రకాశించుచున్నాఁడో? "ఇఁక మీరందఱు మీమీయిండ్లకుఁ బోవచ్చును" అని యాతఁడు సెలవొసంగ "చిత్తము, స్వామీ," అని పలుకుచు లేచుచున్నవారెవరు? వారా? విద్వాంసులు, పౌరాణికులు, కథకులు, పరిహాసకులు, కవీశ్వరులు తమతమప్రజ్ఞావిశేషములచేఁ బ్రభువు నలరించి స్వగృహంబుల కేగుచున్నారు. ఇఁక సభలో మిగిలినవారు రాజుగారి నర్మసఖులు. వారిలో భద్రుఁడనువానిఁజూచి రామచంద్రమూర్తి యేమనుచున్నాఁడో వినుఁడు:

రామ—భద్రా! వార్తలేమైనఁగలవా? పౌరులు నన్నుఁ గూర్చి యేమిచెప్పుకొనుచున్నారు? జననీగురుసోదరాదు లేమనుచున్నారు? నీవు వినియుండకపోవుగాన, దాఁపక యథార్థము వివరింపుము.

భద్రు—(చేతులుజోడించి) స్వామీ! దేవరవారిని గుఱించి యెవరేమియనుకొనుచున్నారని వేఱే యడుగవలయునా? "ఇటువంటిమహానుభావుని మనమిఁక నెన్నఁడును జూడఁబోము. ఈయనయే మనలను శాశ్వతముగా నేలవలయును" అనునదితప్ప వేఱొండుమాట పలుకువారెవరు? గురునాజ్ఞ నరణ్యవాసమొనరించి, సేతువుంగట్టి యసురులంగూల్చిన మీయసమానప్రభావము నెల్లరు నెల్లెడల నెల్లవేళలఁ గీర్తించుచుండ వింటిని.

చ. నరులకుశక్యమే యనిమొనర్ ఖరదూషణముఖ్యరాక్షసే
శ్వరులజయింప, వాలినడఁపం, గపివర్యులచేఁ బసల్ గొనం
బరుషశరాగ్రబిందువుగ బల్కడలిన్ ఘటియింప, నీతఁడా
హరియొ హరుండొ యంచుజనులాడఁగవిందు నరేంద్ర నావుడున్.

రామ—(చిరునగవుతో) నీవు చెప్పినది నిజమైయుండవచ్చునుగాని, రాజ్యపరిపాలనమన్న సులభకార్యమా? ఎంత వాఁడు రాజైనను లోపములుండకుండునా? భూషించువారు కొందఱు, దూషించువారుకొందఱు నుందురుగాని యందఱును మెత్తురా?

తే. తొలుత రాజ్యంబుసేయంగ దొడఁగి మనము
వివిధవర్ణాశ్రమంబుల వృత్తమరసి
యలవరించుచోఁ గొందఱ కహితమగుటఁ
గొన్నిమాటలు పుట్టకయున్నె యనిన.

భద్ర—దేవా! తమ కీయనుమాన మేల? తమరాజ్యపాలనము సర్వవిధములఁ బ్రశస్తముగా నుండుటచేతనే జనులు మిమ్మెప్పుడును సన్నుతించుచున్నారు.

ఉ. ఈయనుమానమేటికి నరేశ్వర మీపరిపాలనక్రియో
పాయము, ధర్మనిష్ఠయుఁ, గృపాగుణమున్ వినయంబుపెంపున్
న్యాయవిశోధనంబును, నియంత్రితసత్యవచోవిలాసముం
బాయక విందు నెందు నరిభంజన సూరిజనానురంజనా!

రామ—భద్రా! నేనింతవాఁడ నంతవాఁడ ననుమాటలే చెప్పితివిగాని, నాదోష మిదియని నిందసేయువారులేరా? అప్రియములుపల్కిన నామన స్సెట్లుండునోయని యనుమానించుచున్నావుగాఁబోలు! నాగుణములను బ్రశంసించువారికంటె, దోషములను జూపువారే నాకుఁ బరమప్రియులు. వారిపై నాకనుగ్రహమేగాని, యాగ్రహమెన్నఁడు నుండదు. కావున సందేహింపక నీవెఱిఁగినది యెఱిఁగినట్లు చెప్పుము.

భద్రు—(సంశయముతో) మహాప్రభూ! ఇంకేమి మనవిచేయుదు? నిష్కళంకచరితులైన మిమ్ముఁగూర్చి దుర్భాషలాడువా రెవరు?

రామ—నీడెందములో సందేహ మేదియోయున్నట్లు నాకుఁ దోఁచుచున్నది. అబద్ధములాడక నీవు విన్నదంతయుఁ దెల్పుము.

భద్రు— దేవా! అందఱను మెప్పింపఁగలవా రెవరు? సుజనులాడువాక్యములే మనము పాటింపవలసినవిగాన నవి తెల్పితిని. దుస్స్వభావముగలనీచులేదేని రంధ్రాన్వేషణమొనరించిన మనము లెక్కచేయఁగూడదుగదా.

సీ. కరుణగల్గినరాజకఁ (?)తీవపుసిఁగన్న
మెత్తనివాఁడంచు మెచ్చరతని
దురుసుదండనలతో ధరయేలు దొరఁగన్న
హింసాపరుండని యెంచ రతని

ధైర్యసంపన్నుఁడౌ ధరణీశ్వరునిఁగన్నఁ
గఠినచిత్తుండని కదియ రతని
సుజనులఁబ్రోచు భూభుజునిఁగన్నను బక్ష
పాతియం చలఁతిగాఁ జూతు రతని

ఆ. నే వివేకవంతు లేమెఱుంగుదురట్టి
యెఱుక లేసి జనుల సరకుసేసి
మొఱకుపలుకు వినెడికొఱకు మేకొనఁగ, దే
వరకుఁ దగునె యోజపరకుమార!

రామ—(ఆతురతతో) నీ మాటలనుబట్టి చూడఁగా నెవరో యేదియో నిందావాక్య మాడినట్లు పొడగట్టుచున్నది. మన కిష్టమైనది పల్కినవారు సజ్జనులును, అనిష్టముపల్కిన వారు దుర్జనులు నని తలఁపఁదగునా? రాజైనవాఁ డందఱయభిప్రాయము లెఱిఁగి యథార్థము గ్రహించి తగురీతి నడచుకొనవలయునుగదా. కాబట్టి యెవరు నీకు దుస్స్వభావులుగాఁ గాన్పించుచున్నారో, వా రాడినమాటలఁగూడఁ దెల్పుము. వీ దెంతవఱకునిజమో నేనుబాగుగా యోచించి కనిపట్టఁ గలను.

భద్ర—(స్వగతము) అయ్యో! దేవుఁడా! నా కెట్టియవస్థపట్టినది? సౌజన్యరత్నాకరుండైన ప్రభువరేణ్యునిఁగూర్చి యెవరో కొందఱుతుచ్ఛు లాడినదుర్భాష లేమొగము పెట్టుకొని విన్నవింపను? ఇంతవఱకు దాఁచితినిగాని యిఁక నేమిచేయను? ప్రభు వన్నిమాట్లడిగినప్పు డింకను విన్న దంతయుఁ దెల్పకపోవుటయుక్తమా? తెల్పినచో నాయన మనస్సున కెట్టి

యిబ్బంది గలుగునో? ఏమిచేయుటకును నాకుఁ దోఁచకున్నదే! ఐనను సర్వేశ్వరునిమీఁద భారమువైచి రాజాజ్ఞప్రకార మున్నదియున్నట్టుగాఁ జెప్పుటయే మంచిది. ఆయనసొమ్ముదినుచు, నాయన కవిధేయతఁజూపుట పాపము. ఇంతకును భయ మేమి? అప్రియములు విన్నప్పుడు కోపముఁదెచ్చికొనుటకు శ్రీరామ చంద్రమూర్తి సాధారణరాజా? ఆయన యౌదార్యగరిమ, రస జ్ఞత, వివేకసంపత్తి నెఱిఁగిన నాకింక ననుమానమేల? ఐనను—అయ్యో!—మనస్సు నాలుకను వెనుకకులాగుచున్న దేల? దైవమా! ధైర్యమిమ్ము. ఇఁక్యేఁ డేమికర్మము? కానున్నది కాకమానునా? ఎట్లో యింకఁజెప్ప యత్నించెదను.

రామ—భద్రా! ఏదియో యాలోచనసేయుచున్నావే ల? భయపడక చెప్పుము.

క. లోకులమాటలు సెప్పిన
నా కెగ్గగునే ప్రియంబొనర్పు హితుఁడవై
నీకింత వెఱవ నేటికి
నేకాంతంబయినచోట నేనడుగంగన్.

లోకము నోరుమూయు శుమాడుఁదున్నదే? సీత ప్రేమి యుందును? కావున నిజమాడుము.

భద్ర—(కొంతధైర్యముతో) రామచంద్రప్రభూ! తమ యాపతి మీఱలేను గావునఁ బౌరులాడుపలుకులు విన్నవించెదఁ జిత్తగింపుఁడు.

సీ. ఏకళంకము లేని యిక్ష్వాకుకులమున
సంభవించియు రామచంద్రుఁ డకట!
తొడమీఁద నిడుకొని దోషాచరాగ్రణి
యెత్తుకచని లంక నేఁడుగాల
ముంచినయిల్లాలి నించుక కొంచక
మరలఁ దాఁ గొనివచ్చి మరులుహెచ్చి
యెబ్బెటికము లేక యేలుచు నున్నాఁడు
చెఱకువిల్కానికిఁ జిక్కినాఁడు
తే. పగతురే కాంతలను జెఱపట్టికొన్న
బలిమి విడిపించికొని తెచ్చి కలియవచ్చుఁ
బ్రజకు రాజానుమతమె ధర్మంబుగాదె
యనుచు గుమిగూడి పలికెద రవనిజనులు."

కటకటా! రామచంద్రమూర్తివంటిరాజా, మోహవశుఁ డగుట! ఎంతపాపపుఁబల్కు వినవలసివచ్చినది?

# పదియవప్రకరణము

"Be thou as chaste as ice, as pure as
Snow, thou shalt not escape calumny."
—Shakespeare.

ఆమాట చెవిసోఁకినంత రాముఁ డదరిపడెను. పిడుగడిచినట్లయ్యెను. నోట మాటరాదయ్యెను. ఇంచుక సేపు నిశ్చే

ష్టుఁడయ్యెను. చూచినవారందఱు స్రుక్కిరి. కొంతవడికి ధైర్యముఁ దెచ్చికొని, రామనృపతి తనయొద్దనున్న యాప్తులతో నేదియో పలుకఁబోయెను, కాని, గుండె దడదడ కొట్టుకొనుచుండెను. కడుపు చెఱువయ్యెను. ఇంక నాలు కెట్లాడును! భద్రాదులు రామాభిప్రాయ మెఱింగి "సెలవుతీసికొందు" మని పల్కి తమతమ తావులకుం బోయిరి. అంత నక్కడకుఁ దనసోదరులం దోడ్కొనిరమ్మని రాముఁ డొక సేవకునిఁ బంపెను. వాడు నతిశీఘ్రముగ వారివారిగృహంబులకేగి రాజాజ్ఞ యెఱిఁగించెను. "ఇపుడుపిల్చుట కేమికారణమో గదా" యని భరతాదులు నివ్వెఱపడి తత్తరపాటుతోఁ దత్క్షణమేగుదెంచి, యార్తమూర్తియైన రామమూర్తిం గాంచి, "యిపుడు నృపాలుఁ డేలచింతాక్రాంతుఁడై యున్నాఁడో? ఈతనివంత యెట్లుతీఱునో" యని చింతిలుచు నాయన కధికవినయభక్తులతోఁ పాఁగిలి మ్రొక్కిరి.

"సీ. ఉస్సని నిగిడించు నూర్పుల బలువేఁడి
నించి కెమ్మోవి వాడించువాని
నడఁగకయూడరెడు నశ్రుధారల నడ్డ
గించి ఱెప్పల నప్పళించువాని
నాశ్చర్యరసమగ్నమగుమానసంబుతో
నుడిక చేష్టలు దక్కియున్నవాని
వెలవెలనై చాల వెడనవ్వు వహియించి
మురిపెంబు దఱిఁగిన మోమువాని

తే. దైన్య మాకారమయినచందమున నున్న
వాసిఁ దమయన్నఁ గనుఁగొని, వారు వెఱఁగు
పడి, భయంపడి, తొక్కటపడి కటకట
పడి, దిగుల్పడి, వడఁకుచు భర్తఁ జేర."

రాముఁడు ప్రణమిల్లిన తమ్ములను గరంబుల గ్రుచ్చి యెత్తి, కౌఁగిలించి, చెంతనిడుకొని చేరఁ జేసికన్నులను గ్రమ్ము కన్నీరు కరతలమునఁ దుడిచికొనుచు నేలకు వ్రాలఁబోయినశరీరమును మగుడనిల్పుచు, గద్గదస్వరము నొకింత చక్కఁబఱచికొనుచు, నాలుక తడఁబడకుండ మాటాడ యత్నించుచు, నెట్లో యెప్పటెలుఁగు కుదురుపఱిచి యిట్లనియె. "సోదరులారా! మీరు నాకుఁగూర్మిబందుగులు, ప్రాణసఖులు, నాప్తులు, ధనము, ప్రాణము నై, మీరే నన్ను రాజుఁ జేసికొలుచుచున్న వారలుగావున మీతోఁ జెప్పకుండ నేపనిఁ జేయలేను. ఇప్పుడు నన్నుగూర్చి లోకులాడు నిందావాక్యములు వింటిరా."

మ. అనుజుల్ తోఁ చితవృత్తిఁ బూనియును నా యర్థంబుఁ బ్రాణంబు నా
యనుఁగుం జుట్టము లాప్తులున్ సఖులు మీరై రాజ్యధౌరేయుఁగా
నను మీరే యొనరించికొల్తు రటుగానంబూనఁబో నెద్దియెనను మీతోననకిప్పుడజ్జ లనునిందావాక్యముల్ వింటిరే.

అని యన్నగారనుసరికి భరతలక్ష్మణశత్రుఘ్నులు వెలవెల్లనై "అదియేమినిందయో! ప్రభువర్యుఁ డింతవఱ కెన్నఁడు

నిట్టిమాటలాడలేదే! ఎట్టివార్త వినవలసియున్నదోగదా!" అని తమలోనఁ జింతించుచు, దిగులువడుచు, నొండొరుమొగంబులు చూచుచు, డోలాందోళితమనస్కులై వినుచుండ రామచంద్రమూర్తి యిట్లు చెప్ప సాగెను. "ఏమిచెప్పను తమ్ములారా! 'కామాతురుఁడై రావణుఁడు సీతను జెరగొనిపోయి లంకలోఁ దన మందిరమునఁ జేర్చియుండఁగా రాముఁడు కామబాధ భరింపలేక, మంచిచెడ్డలాలోచింపక, సీతను మరలఁ దెచ్చికొని కూడినాఁడు. రాజధర్మములమఱచెనుగాఁబోలు' నని ప్రజలునన్ను నిందించుచున్నారు. వింటిరా? రాఘవుఁడే భార్యనుదీసికొనిపోయినవానిని వధించిమహాపతివ్రతయని యీమెను గ్రమ్మఱఁ బరిగ్రహించుట పరమధర్మముగా నెంచినప్పు డింక నితరుల కేమియడ్డుగలదనిపౌరు లాడుమాటలు నాహృదయమును జీల్చివైచుచున్నవి. ఈ బాధ నెట్లుసహింపఁగలను?

చ. చెఱగొనిపోయి, యాత్మపురిఁజేర్చి దశాననుఁ డాసరేఁగి గీ
డ్పఱచిన సీతఁదెచ్చుకొని భావజుతీక్ష్ణులకొగ్గి యెగ్గుసి
గ్గెఱుఁగక కూడినాఁ డినకులేశ్వరుఁడక్కట క్షత్రధర్మముల్
నుఱచెనొయంచు నన్నుఁ బ్రజ మాటికిదూఱెడి నేమిదెల్పు
దుర్.

చ. పరుఁ డిపుడే వధూటిఁ జెఱపట్టిన వాని వధించి సాధ్వి యీ
తరుణియటంచుఁ జేకొనుట ధర్మవుగా వగనెంచె రాఘవే
శ్వరుఁ డిఁక నేలశంకయని ప్రాజ్ఞజనులాడెడిమాట లమ్ములై
యుసువడిగుండెలో మెఱయుచున్న విసోదరులారయియ్యెడన్.

లక్ష్మణా! మున్ను సకలదేవతలు ఋషులుఁ జూచుచుండఁగా నేను జానకిని బరిగ్రహింపనొల్లక యగ్నింజొరుమనుటయు, నామె యట్లు వహ్నిఁజొచ్చుటయు, ముల్లోకంబులు మెచ్చుటయు, నంతట నగ్ని తనరూపముతో భూపుత్రిందెచ్చి "యీ యిల్లాలు నిష్కళంకచరిత, పతివ్రతాశిరోమణి; ఈమెను జేకొన సందేహింపవల" దని యప్పగించుటయు, నాపలుకులు సత్యములవి యచ్చటిదేవతలందఱుఁ బలుకుటయు, నీవెఱుఁగుదువుగదా.

మ. అవుగా లక్ష్మణ మున్నెఱుంగవె సమస్తాదిత్యులున్ రుద్రులున్
భవనీరేజభవాదులున్ మునులు దిక్పాలు ర్విలోకింపఁగా
నవనీకన్యక నేనునొల్లక మహోగ్రాగ్నిం బ్రవేశింపు మ
న్నవిధంబున్ సతివహ్నిఁజొచ్చుట రహిం ద్రైలోక్యమున్ మెచ్చుటల్.

ఉ. అప్పుడువచ్చి వహ్ని తనయాకృతితో ధరణీజఁదెచ్చి యీ
యొప్పులకుప్ప సాధ్వి, సుగుణోన్నత నే సకలాంతరాత్మనై
యెప్పుడుగాంతు నొచ్చెమొకయింతయులేదని యప్పగింపఁడే
యప్పలుకుల్ నిజంబులని యాడరె యచ్చటివేల్పులందఱున్.

ఇఁక నాతప్పేమియున్నది? నేను దశకంఠునిఁబరిమార్చి తమకొనరించిన యుపకారముదలఁచి నాప్రీతికై "సీత ఉత్తమురాలని దేవత లబద్ధమాడినారా యేమి? జనకతనయయొక్క పరిశుద్ధాత్మ నేనెఱిఁగినవాఁడనయ్యు మూఢులనోళ్లుకట్టుటకే

దా, యామె ననలముం జొరుమంటిని. ఆసంగతినైనం బాటిం
రైరిగా!

క. అని మొనం బంక్తికంఠు దునుమాడిన మేలుదలంచి యిచ్చకం
బునకు ధరాజ మంచిదని బొంకిరొ వేల్పులు, సీతభావమేం
గనియును మాఘు లిట్టులనంగాం గలరంచుం దలంచిగాదె యు
య్యానలము మండంజేసి చొరుమంటిని దానిని నెంచరైరిగా.

పోనిండు. పామరులాడు మాటను బాటించి ఖేద మొంద
గాదందు రేమో, యెవ్వరిచేనైనం దిట్లుపడినిందితంబైన బ్రతుకు
బ్రతికి చచ్చినవానికి రౌరవాదినరక బాధలు తప్పునా? భూమి
మీంద జీవించియుండియు నిందంబొందినవారు చచ్చినవారలే;
కీర్తినొందినవారు మరణించియు నెల్లప్పుడు జీవించువారలే. కా
వున వివేకులు పుణ్యయశమార్జించుటకై సదా యత్నింపవల
యునుగదా.

క. క్షితిమీంద బ్రతికియుండియు
మృతింబొందినవారు నింద లెనసినవారల్
మృతింబొందియు బ్రతికిన ఘను
లతినిర్మల కీర్తిదేహు లవరజులారా!

కావున నీయపనిందం బాయుటకై నాప్రాణములను
గాని, ప్రాణములకుం బ్రాణములైన మిమ్ములనుగాని త్యజించు
టకు వెనుకదీయని నాకు సీత నెడం బాయుటెంత?

"శ్లో. స్నేహం దయాంచ సౌఖ్యంచ యదివా జానకీ మపి
ఆరాధనాయలోకస్య, ముఞ్చతో నాస్తి మేవ్యథా."
(ఉ. రా. చ. భవభూతి)

సడికంటెఁ జావుమేలని ఆర్యులు పల్కుచుండురుగాన, నే నపకీర్తి పోఁగొట్టుకొనఁదగువిధ మాలోచింపవలయునుగదా. అందులకు జానకి నిప్పుడు పరిత్యజించుటయేతప్ప వేఱొండుమార్గము కానరాదు. ఇట్లుచేయ నిశ్చయించితిని. మంచిదైనను గీడైనను మంచిదంచువినుఁడు. అడ్డము చెప్పకుఁడు.

"క. జడమతులయిన జనంబుల
వెడమాటలుమాన్ప నిదికు వెర వెబ్భంగిన్
సడికంటెఁ జావుమే లని
యెడిపలుకు దలంపవలదె యిలఁ బురుషులకున్.

ఆ. ప్రాని జీవితంబులైన మిమ్మైనను
వలయుచోట విడువవచ్చుఁగాని
వర్తనంబు గౌరవంబొకయించుక
యైన విడువ దుస్సహంబు నాకు.

క. ఒకభంగిఁ బాపికొనరా
దొకో మిథ్యానిందయనుచు నొండు దెఱఁగుమీఁ
రకుటిలచిత్తులరై చూ
డకుఁడీ నామదికి సంకటం బిదియెల్లన్.

క. ఏనెఱిఁగియయిన నెఱుఁగక
యైనను నిత్తెఱఁగ నిశ్చయముచేసితి నా
యానసుఁడీ నాకడ్డము
గా నొకపలుకైనఁ జెప్పఁగఁదగిరేనిన్."

ఈమాట లాలకించి రామసోదరులు "అయ్యో, అయ్యో" అని వెక్కి వెక్కి యేడ్చుచు జీవచ్ఛవములైరి. అప్పుడు వారిహృదయంబు లెట్లుండెనో యెవఁడు వర్ణింపఁగలఁడు? ఈప్రకరణము వ్రాయునప్పుడు నేనే దుఃఖ మాఁపుకొనలేక కన్నీరుగార్చుచుండ భరతలక్ష్మణ శత్రుఘ్నులమాట వేఱెచెప్ప వలయునా?

# పదునొకండవ ప్రకరణము

"గీ. ఈశ్వరుండు విష్ణుఁ డెవ్వాఁ డెవ్వని
నేమి సేయుఁ బురుషుఁ డేమియెఱుఁగు
నతనిమాయలకు మహాత్ములు విద్వాంసు
లడఁగి మెలఁగుచుందు రంధులగుచు."

—భాగవతము.

రాముఁడు ధైర్యమూని సౌమిత్రిం గనుంగొని "లక్ష్మణా! మాటలు వేయు నేల? నామీఁదఁబడిన లోకనిందఁ బాఁపుటకై నీవు రేపు సూర్యోదయకాలమందు మీవదినెను రథములోఁ గూర్చుండఁ బెట్టికొని వాల్మీకాశ్రమమున విడిచిరమ్ము. ఆమెయే గంగాతీరముననున్న తపోవనములను జూడఁగోరినది గావున నా నెపంబున మనసంకల్పము నెఱవేర్పవచ్చును. నీవు దుఃఖింపకుము. అట్టి కాంతారత్నముపై నింత మూర్ఖత్వ మేల పూనితలఁపకుము. నేఁటితో మీవదినెకును నాకును ఋణానుబంధ

ము తీఱెననుకొనుము. కాదేని ప్రజలట్టిమాటలాడుదురా? దైవవిధి దాఁట నెవరితరము?

తే. ఇంతిపై నింతమూర్ఖత్వ మేలయనకు
మవనిజకు నాకుఁ దీఱె ఋణానుబంధ
మదియుకాదేని జను లిట్టులాడుకొందు
రయ్య, యిఁక నేల పలుమాట లాడుకొనఁగ."

అని యానతిచ్చి భరతాద్యనుజుల గృహంబులకుఁ బనుప వారు తలలువాంచి, కనుఁగవల నశ్రుధారలుఁగురియ నచ్చోటు వాసి చనిరి. పిమ్మట రఘురామచంద్రమూర్తి విన్ననైన మొగంబుతోఁ దనసదనంబుఁ జేరి యెంతధైర్య మవలంబింపవల యునన్నను సాధ్యముగాక, నిద్రపట్టక, యపనింద మఱవలేక సీతనుదలంచుట మానలేక, శోకమాఁపుకొనలేక, వలవలయే డ్చుచు నారాత్రి నొకయుగముగాఁ గడపెను. ఆతనిసోదరుల యవస్థయు నట్లేయుండెను.

---

# పండ్రెండవ ప్రకరణము

There is a destiny that shapes our ends
Rough hew them how we will.

—Shakespeare

తెల్లవాఱినది. అన్యాయముగ సీతారాములను నిందిం చినప్రజను మాడ్చివేయు రోషరక్తాననుఁడై వెలిఁగెనోయున్నట్లు

సూర్యుఁ డరుణారుణాంశుసంతానముతోఁ దూర్పుదిక్కునఁ బొడగట్టెను. అంతఁ దత్సమయోచితకృత్యములు నిర్వర్తించి లక్ష్మణుఁడు—అన్నగారియానతిని బితృవాక్యముగా భావించి శిరసావహించులక్ష్మణుఁడు—దుఃఖసముద్రమున మునిఁగినవాఁడయ్యు నెట్లో ధైర్యముఁబూని సుమంత్రుఁజూచి "దేవి, నాథు ననుజ్ఞవడసి, త్రిభువనపావనియగు భాగీరథీనదీతీరమున నున్న తపోవనములు చూడఁబోవునుగావున రథము సిద్ధముఁ జేసి తీసి కొనిరమ్ము" అనిపలికెను. అతఁడు శీఘ్రముగ నరదముసింగారముచేసి గుఱ్ఱములఁగట్టితెచ్చెను. సౌమిత్రి దృఢాత్ముండగుటచే దైన్యమావంతయేని ముఖాబ్జంబునఁ దోఁపనీక సీతాసీమంతినీమణికి సభక్తికంబుగఁ బ్రణమిల్లి "అమ్మా, నీవు ఋష్యాశ్రమములు చూడఁగోరినందున నిన్నిప్పుడు దోడ్కొనిపోవ విభుని సెలవైనది. కావున రథమెక్కుము" అని వినయముతో విన్నవించెను. సీతమ్మతల్లి వేడుకపడుచు "నాథునికి నాయం దెంతదయ యుండకపోయిన నిట్లు సెలవిచ్చును! భాగ్యమన నాదే గదా! ఇంక బయలుదేఱిపోదమా" అని యత్యుత్సాహముతో "మునిపత్నుల కిత్తు" నంచుఁ గొన్ని హేమాంబరరత్నభూషణచయంబులు గైకొని యత్తలకును భర్తకును మ్రొక్కి మఱఁదితోఁగూడ రథ మధిష్ఠించెను. "ఎంతయమాయికురాలు! ఎంత గుణసంపన్న! జరిగినదేమియు నీమెయెఱుఁగదే! అయ్యో! ఈ సాధ్వీమణి నొంటి నడవిఁద్రోచి యెట్లురాఁగలను?" అని సౌమిత్రి లోలోనఁ గుందుచుండెను. సుమంత్రుఁడు రథాశ్వముల హుటాహుటిఁ దోలుచుండెను. కాని, రానున్నయాపదకు సూ

చకంబులుకాఁబోలు! తోవలో జనకతనయ కనేకదుశ్శకు నంబులయ్యె. అవి గని మాయామృగ భీతినొంది దైన్యమునించ లక్ష్మణునితో "అన్నా! యీదుర్నిమిత్తములఁ గాంచితివా?

సీ. నరియఁడు దెసవాఁగె గరుడియు బాలయు
నెడమనుండియువచ్చి కుడినినిలిచెఁ
జెవులపో తెదురయ్యెఁ జెమరుఁ డా దెసఁజూపెఁ
బలుమారు నిదేవిచెఁ బైఁడికంటి
నుడిగాడ్పు తేరి నల్బుట్టుఁజుట్టలు వెట్టెఁ
గడిఁదిమంటలు వెళ్లఁగ్రక్కెనక్క
యడ్డమై కాలాహి యాదె పుట్టతుది కెక్కెఁ
గనుఁగొంటె ధ్వజముపై గ్రద్దలాడెఁ

తే. గావిరి దిగంతములనెల్లఁ గ్రమ్ముకొనియె
ధరణి గిరగిరదిరుగుచందమునఁదోఁచె
గగనమణిమాసెఁ బగలె ఘూకములుమోసె
నన్న! లక్ష్మణ! యిదియేమిమూగడంబొ.

కటకటా! ఏల యీయమంగళసూచకములు పొడగట్టె. నాకు భయమగుచున్నది. ఏమి కీడుమూఁడనున్నదోగదా! నాప ఘుని, నాప్రాణనాథుని, నాప్రభుని నారఘురామదేవునిఁ బాసి మునిపత్నులనుజూడఁగోరితినేల? నావంటి యవివేకురాలు గల దె? పోనీ, ఆయానవైన నబలలు బాగోగు లూహింపలేనివారని నాకేర్కె నణఁచియుండరాదా?

ఉ. నాసఖు, నామనోహరుని, నాప్రభు, నారఘురామదేవునిన్
బాసి వనాళినున్న మునిపత్నులఁ జూచెదనంచు నేల పే
రాస గణించివచ్చితి, హితాహితచింతలు లేనివారుగా
రే సతులంచు మాన్ప కతఁ డేమిటికిన్ వరమిచ్చె లక్ష్మణా!

నీకేదైన వాంఛయున్నదా యని నాథుఁ డడిగినప్పుడు వనములు చూడఁగోర నేల? పదునాలుగేండ్లనుండి నిన్న మొన్నటి వఱకును జూచిన వనములే కావా? "వినాశకాలే విపరీతబుద్ధిః" అన్నట్లు మరలఁ గష్టము లనుభవించుటకే గాఁబోలు, నాకట్టి విపరీతకాంక్ష కలిగినది!

చ. నను మదికోర్కి దెల్పుమని నాథుఁడనంబదునాలుగేండ్లుచూ
చినవను లింతెకా యని విశేషము పేర్కొని టిచ్ఛగింప కే
మని వనిఁజూడఁగోరితి హహాహా! యిటులన్ విపరీతకాంక్షపొ
త్తురఁజను పాపజాతికిని దుశ్శకునంబులు గాకయుండునే.

చ. కుమతి వినాశకాలమునఁగన్ విపరీతపుబుద్ధిఁబూని యా
క్రమములె కాంక్షచేసి చెడుఁగావున నేనును గోరరాని ది
ష్టమునితలంచి దుర్దశఁబడం బఱతెంచితి మీఁద దుర్దశా
సమితికి నీనిమిత్తము లె సాకిరిగావె నృపాలనందనా."

అని కొందలమందినడెందముతో గడగడవడఁకుదేహముతో దైన్యము వెల్లడించుచూపులతోఁ బలికి "ప్రియు నెడఁ బాసివచ్చు నావంటిసాహసికురాల కిఁక వంతయేల? దేవతలీయాప శకునములవలనఁగలుగు నాపదలన్నియు మాన్చి, నాప్రాణనా

ధునమును, నాథును, అత్తలమును, తక్కిన బాంధవపౌరకోటికిని సకలశుభంబు లనుగ్రహింతురుగాక" అని నమస్కారపూర్వకముగఁ బ్రార్థనచేసెను. ఈపలుకు లాకర్ణించు చున్నపుడు లక్ష్మణునిగుండె బ్రద్దలైన ట్లుండెను. ఏమియువచించుటకు నాలుకాడ లేదు. కొయ్యబొమ్మవలె స్తంభీభూతుఁ డయ్యె. అట్టి పరిశుద్ధహృదయను బతితోఁగూడి సుఖించునట్లుచేయక కష్టములపాల్పఱిచిన విధి నేమన్నను బాపములేదుగదా! లక్ష్మణుఁ డేమోయనఁబోవు—మాను—వగచు—ఉస్సురను — తలవంచు. రథము క్రమక్రమంబుగా నడవులుగడచి, యేఱులుదాఁటి, పర్వతంబులు క్రమించి, పల్లెలతిక్రమించి చనెను. ప్రొద్దుగ్రుంకుసరికి గోమతీతీరము సమీపించినది. సీతాలక్ష్మణులు నాఁటిరాత్రి యచ్చటనుండి, మరునాఁటిమధ్యాహ్నము తేరెక్కి భాగీరథీ తటాంతరమున కరిగిరి. ఉత్తుంగతరంగరంగమగు గంగనుజూడ సీత యంతరంగ ముప్పొంగెను. కాని, పాపము! ఆ యానందము క్షణభంగురమని యామెకుఁ దెలియదుగదా!

# పదుమూఁడవప్రకరణము

"Say, wast thou conscious of the tears I shed?"
—Cowper.

కన్నతల్లిని సేవించునట్లే వదినెనుగూడ సేవించుటయే నిత్యవిధిగ నెంచు లక్ష్మణుఁ డామెతో "రాముడు నిన్ను

వీడినాఁడు. నీదారి నీవు చూచికొనుము" అని యేమొగము పెట్టికొని చెప్పఁగలఁడు. ఇంతవఱ కెన్నఁడైన నొక్క యప్రియమైనఁ బలికి యావిమలహృదయకు దుఃఖముఁ గలిగించినాఁడా? ఆమె మోదమే తనమోదమనియు నామెఖేదమే తనఖేదమనియు భావించి సకలోపచారములు చేయుచుండలేదా? రావణాసురుని మూలమున నాసాధ్వికి మున్ను భర్తృవియోగము తటస్థించిన ప్పుడు కన్నీరు కాల్వలుగట్టిన ట్లేడ్చి, పునస్సందర్శనమగువఱకు నిద్రాహారములు లేక కృశించియుండ లేదా? అట్టిలక్ష్మణునిగుండె యిప్పుడు రాయియగునా? కాదు. ముమ్మాటికిని గాదు. నిలుపరానివగవున నెల్లుకన్నీరు గార్చుచున్నాఁడు — అదిగో — చూడుఁడు. జానకి యతనిదైన్యాకారముఁ గని, వెతయు, దిగులుఁ బొందిగొని యిట్లు పలికెను: "అన్నా లక్ష్మణా! ఇల్లు విడిచినప్పటినుండి నీవదోకలాగున నుండుటఁ జూడఁగా నాకు భయమగుచున్నది. నీమొగంబులో విన్నఁదనము పొడఁగట్టుచున్న దేల? మీయన్నగారికిని, సహోదరులకును, ఆప్తులకును. శుభమేగదా?

ఉ. విన్నఁదనంబుమించెఁ బురి వెల్వడినప్పటినుండి నీమొగంబు
న్నతెఱఁగుఁగాంచి దిగులొందుచునుందు నిదేమి చందము, మీ
యన్నకుఁ దత్సహోదరుల కాప్తులకున్ శుభమేగదన్న నీ
కన్నులనేల నశ్రువులు గ్రమ్మెడిఁ దెల్పఁగదన్న లక్ష్మణా!

సకలభోగములఁ బరిత్యజించి, తొల్లి యన్నగారితోఁ గూడ నరణ్యవాస మొనరించినప్పుడైనను, మాయలమారియైన యింద్రజిత్తుతోఁ బోరాడునప్పుడైనను, దుష్టుఁడైన రావణ

ణుని బాణములు నీయురమున నాటినప్పు డైనను నీవు కంటఁ దడిపెట్టలేదే? నేఁ డిట్లుండుటకుఁ గారణమేమి?

చ. అడవిని ద్రొల్లి శ్రీ ద్రొఱఁగియున్న నను గొల్చుచు వచ్చినప్పుడున్
గడుసరియింద్రజిత్తునిముఖాముఖిఁగయుద్ధము సేయునప్పుడున్
జడుఁడగు రావణాసురునిశ క్తి యురంబున నాటినప్పుడున్
బొడమదు కంట నీరిపుడు పుట్టిన దేటికొ తండ్రి తెల్పవే.

అన్ని చింతల నన్నిరోగముల మాన్పఁగలిగిన పావనగంగా నది చెంతనుండియు విచారపడుట తగునా? కారణము లేని కళ వళపాటునొందక వేడుకతో నదిదాఁటి, ఋషిభార్యలకు మన మందెచ్చిన కానుక లిచ్చి, వారి యాశీర్వచనములఁ బొంది యిప్పుడే వత్తము, రమ్ము."

అంత లక్ష్మణుని దైన్యము మఱింత హెచ్చయ్యెను. అది కనిపట్టి సీత "పోనీ, లక్ష్మణా మరలిపోదమా? కనరాని దుశ్శకునములు కంటఁబడినప్పటినుండియు నాకును మనస్సు బాగుగా లేదు. ఇట్టియవస్థలో వనముఁ జూచు టేల?" అనిపలుకగా సౌమిత్రి కన్నీరు గ్రుక్కుకొని యున్నగారు మున్నన్నది తలఁచి, దైన్యభావ మొకించుక డించి, "తల్లిరో! చిన్నటిదుర్నిమి_త్తము లె నాకుఁ జింతాకరములయ్యె వచ్చినపని కాకుండనయోధ్యకుఁ బోనేల? అవలిగట్టునకే యేగుదము" అంచు వచించి, రథము డిగ్గి, యోడపై నదినె నెక్కించి, దుఃఖము హెచ్చఁ దానును నెక్కి, నదిదాఁటి, గట్టుఁజేరి యుఁక శోక మాఁపుకొనలేక యశ్రుధారలుఁ గురియుచు "అమ్మరో, సర్వజనులు "ఛీ, ఛీ" యనుచునిఁ

బూనివచ్చిన పాపాత్ముఁడను; శోకదవాగ్నిఁ గ్రాఁగుకంటె మరణమే మేలు; కావున నన్ను శిక్షింపుము తల్లీ" యని సీతాదేవిచరణములచెంగట వ్రాలి మ్రొక్కి వెక్కివెక్కి యేడ్చుచుండెను.

అంత జనకసుత ధైర్యము వీడ, శరీరము కంపముఁ జెందఁ బెదవులు తడఁబడఁ,దుద మొదలు లేని దీనత గదురఁగ, మఱఁదిం జూచి "అన్నా!మున్ననేకఘోరవిపత్తులు సంభవించినప్పుడైనను నీవింత వంతనొందలేదే. ఇప్పుడిట్లు దుఃఖించుటకు హేతువేమి? సుగుణరత్నాకరుఁడవని ప్రజలందఱు నిన్నుఁ గొనియాడుదురు గదా. నేఁ డెవ్వరికైన నెగ్గుదలంచితివా? మీయన్నగారేమేని యన్నారా? గురునింద యాచరించితివా? పరదూషణము చేసితివా? శరణన్నవారలఁ ద్రోచిపుచ్చితివా? శత్రువులకు వెఱచివచ్చితివా? రామాజ్ఞలేక నన్నుఁ దీసికొనివచ్చినావా? లేక స్వామికి నాపైఁ బ్రేమతప్పినదా? ఎందుచేత నట్లడలెదవు తండ్రీ, మాటాడవేమి? నాకు భయమగుచున్నది. రఘుకులకలశాబ్ధిసంపూర్ణచంద్రుఁడును, నిరుపమధీరోదాత్తుండును, సౌందర్యరాశియును, మహనీయగుణగణాలంకారుఁడును నగు మనప్రభువరేణ్యుఁడు సుఖముగానుండఁడే? అనుమానముమాని యిఁక నిజముఁ దెల్పుము.

చ. పరసతులెల్లఁ దల్లులుగ భావనసేయుదు పెల్లవేళలన్
బరధన మన్న హాలహలభంగిగఁ జూతువు బొంకవెన్నఁడుం
బరుషములాడ వెవ్వరిని, బ్రాహ్మణభక్తియు రామసేవయుం
దిరమగునీకుఁ దండ్రి జననిందితకృత్యము లెవ్వియుమ్మొడన్ ?

క. మన్నన దొలంగి నిను మీ
యన్న నిరాకరణచేసియాడెనొ నీ కా
యన్నపయి భక్తి దొలఁగెనొ,
కన్నాయము నేమియైనఁ గావించితివో.

క. గురునింద యాచరించితొ
పరదూషణచేసితివొ, కృపారహితుఁడవై
శరణన్నవారిఁ ద్రోచితొ
యరులకు వెన్నిచ్చి వేగ యరుదెంచితివో.

క. రామాజ్ఞ లేకయే వను
దీమసమున నిందుఁ దోడితెచ్చితొ నాపై
స్వామికృతి యెడసియున్నదొ
యేమిటి కడలెదవు తండ్రి యెఱిఁగింపఁగదే.

శా. సౌమిత్రీ భయముమ్యోదిర్చి మనపు మాత్మా దేవిజామాతయా
శ్రీమత్పద్మదళాక్షుఁడా రఘుకులక్షీరాబ్ధి పూర్ణేందుఁడా
హేమక్ష్మాధరధీరుఁ డా యసుర మత్తేభేంద్రహర్యక్షుఁడా
శ్యామాంగప్రభుఁ డామహాప్రభుఁడు లెస్సైయున్నవాఁడే పురిన్

అనియాతురతతో నడిగెను. కాని యాతఁడు చెప్పుటకుఁ బెదవులు మెదల్పలేక యింతింతయనరాని సంతాపము నొందుచుండెను. ఇట్లెంతకాలము దాఁపఁగలఁడు! రామాజ్ఞ నెఱవేర్పవలదా? అయోధ్యకు మరలిపోవలదా? కావున లక్ష్మణుఁడు యథార్థముఁ జెప్పుట కెట్టకేలకెట్లో దృఢనిశ్చయుఁడై లేచిచేతులు మోడ్చి కన్నీరు మున్నీరుగాఁ బ్రవహింప వదినెతో నిట్లని యె

"అమ్మా! ఇంకఁ జెప్పకతప్పునా? "రాక్షసునిచేతికిఁ జిక్కినసీతను మరలఁ దెచ్చుకొని యేలుచున్నాఁడు రాముఁడు, ఎంతమోహమో" అనికొందఱుతుచ్ఛులాడిన విని నిందసహింపలేక నిన్నరణ్యములలో డించిరమ్మని యన్నగారు నన్ను నియమించిరి. క్షుద్రజనులాడుమాట లమ్ములవలెఁ దనహృదయమ్మును నాటి వేధించుటచేతనేగదా ప్రభువు నీయెడఁబాటుసహించుట! నీ వెంతమాట వినవలసి వచ్చెనమ్మా! ఇంతమాటవచించుటకు నే నెంతపాపినో! ప్రపంచికసుఖము లన్నియువిడిచిన తపోనిధులాశ్రయించు ఘోరారణ్యములలో నీవింక దినములు గడుపుమని చెప్పిన యీనాలుకను గోసివేసినసేమి; కాననములలో నిన్నుఁ ద్రోయవలయునని రాముఁడు చెప్పఁగావిని సహించితినిగా! సహించుటయేగాక వేగమున నిన్నుఁ గొనివచ్చితినిగా! అయ్యో! నావంటి మూర్ఖునిఁ గఠినచిత్తుని బ్రహ్మయెట్లుసృష్టించెనో! అమ్మయ్యో! ఈభయంకర కాంతారములలో నెక్కడనిల్చి యెట్లు వేగించెదవమ్మా! ఎవరు చెలికత్తియలగుదురమ్మా! ఎట్లు రోజులుగడుచును తల్లీ! దేవుఁడెంతనిర్దయుఁడు! నీవిపులచిత్తము వినయాది సద్గుణసంపత్తి నెఱిఁగి యుండియు, లోకనింద పడలేక నీకొఱికనెపంబున నిన్నిచ్చటికంపినాఁడుగా! అతఁడింక మీఁదట నీవిరహాబ్ధి నెట్లీఁదగలఁడో? తల్లిరో! ఇట్టిదుర్గతి పగవారికివచ్చిననుజూడలేముగదా! నిన్నిచ్చటవిడిచి యెట్లుపోఁగలను! రాఘవుఁడు నన్నిట్టిపనిచేయ నేలయాజ్ఞాపించెను?" ఈదుశ్చిత్తుఁడెంతకైనఁ దగినవాఁడే" యనియెఱిఁగియే పంచెనుగాఁబోలు. కటకటా! నీకెట్టిగతిపట్టెనే! అమ్మా! నీవు పరమపతివ్రతా

శిరోమణివి. నీచరిత్ర మెల్లయిల్లాండ్రకు మేల్బంతి. అట్టినీకు భర్తృ వియోగము గలిగించిన మహాపరాధిని, ఇంక నూరికేగుమని యీపాపాత్మునకు సెలవియ్యవే తల్లీ!

ఉ. ఇంతకుఁ బూనివచ్చి వచియింపకపోదునె విన్ము తల్లి దు
శ్చింతులు దైత్యుచేఁ బడిన సీతను గ్రమ్మఱ నేలుచున్నవాఁ
డంచని మోహి రాముఁడని యెగ్గులువల్కిన నాలకించి భూ
కాంతుఁడు నిందఁ జెంది నినుఁ గానలలోపల డించిరమ్మనెన్.

క. క్షుల్లకజన దుష్టవచో
భల్లకదంబముల హృదయపద్మము గల భూ
వల్లభుఁ డోరిచె భవదా
యల్లకభర మేమివినియె దమ్మరొ యింకన్.

చ. మునులు మహాతపోనిధు లమోఘదయాంబుధు లాశ్రయింమ కా
ననములు చేరి నీవిఁక దినమ్ములు త్రోయఁగదమ్మ యంచు నీ
యునికి కనర్హమైన యెడ లొప్ప గణింపఁగ నొగ్గనాల్క నీయ
నదతనంబు సైఁచె మదియమ్మరొ! యెంతటి కైతిఁ జూడుమా.

ఉ. జనపతి లోకనిందఁ బడఁజాలక నిన్ వనిఁ ద్రోయుమన్నచో
విని సహియించి కానలకు వేగమునం గొనితెచ్చి నిల్పఁగాఁ
జను నెడ లుగ్గడించి ధృతిసంపదఁ బొంపిరివోవుచున్నవాఁ
డను ననువంటిమూర్ఖు నకటా విధి యేగతి సృష్టిసేసెనో.

ఉ. అంచిత వామలూరుజవనాంతరభూముల నిన్ను డించి ర
మ్యంచు రఘూద్వహుండని చెనక్కటయక్కడనిల్చి యెట్లు వే
గించెదవమ్మ యెవ్వరు సఖీజనులయ్యెదరమ్మ యేమి యూ
హించి దినంబులింకఁ గ్రమియించెదవమ్మ పతివ్రతామణీ!

ఉ. నీవిమలప్రభావమును నీవినయాదికసద్గుణంబులన్
దేవుఁ డెఱింగియుండియును నిందలకుంబుయిలోడి యో జగ
త్పావని! నీవుగోరిన నెపంబున నిచ్చటి కంపినాఁడుగా
కీవిరహాబ్ధి నేకరణి నీఁదఁగలాఁ డతఁ డింకమీఁదటన్.

ఉ. దాతులకైన నిట్టివెతదార్కొన నేగతిఁజూడవచ్చు ని
న్నీ యటవీస్థలిన్ విడిచి యేనెటులేగుదు నన్న నేల భూ
నాయకుఁ డిట్టిబెట్టిద మొనర్పఁగఁబొమ్మనె నెద్దియైనచోఁ
జేయఁగనోడఁ డీ కఠినచిత్తుఁడటంచు నెఱింగి పంచెనో.

సీ. మితిలేని యీమిడి మేలంపు మొకములు
సకియలబలఁగమే జనని నీకుఁ
బరికింపరాని యీ బలుమలల్ నవరత్న
మయచంద్రశాలలే మాతనీకుఁ
గడుభీతిముంచు నీగహనముల్ విహరింపఁ
దగినపూఁదోఁటలే తల్లినీకు
ఘోరనక్రభుజంగకోటితో మలయు నీ
హ్రదములు కొలఁకులే యంబనీకు

గీ. బంధురములైన యీమహాప్రస్తరంబు
లి దుమణివేదికలె జనయిత్రి నీకుఁ
గటకటా! యెంటి నిచ్చోట నెటులనిలిచె
దమ్మ, నీయునికి కేమందు నమ్మ నేను.

మ. జననీ! నీవు మహాపతివ్రతవు నీసౌశీల్య మిల్లాండ్రకె
ల్లను మేల్బంతి రఘూద్వహాంఘ్రియుగళీలగ్నాత్మవైయుందు వీ
యని నేనెవ్వఁడ విన్నవింపఁ బతిఁబాయంజేసి నిన్నొంటిడిం
చినపాపాత్ముఁడ నూఁరికేగుమను మాటె ల్విచ్చె దేనావుతఁగా.”

# పదునాల్గవ ప్రకరణము

“ హతవిధిపరిపాకః కేనవా లఙ్ఘనీయః?”

—భర్తృహరి.

మఱుఁదినోటనుండి వెలువడినమాట లాలకించినంతనె సీత “హా! తల్లీ !” యనుచు గొడ్డటిచే నఱుకఁబడిన వృక్షముకరణి నేలపైఁ బడెను. పడి యొడలెఱుంగక రెండుగడియలుండి తెలివొంది, వెండియు నలసి, యవశయై దీనదశంబొరసి, మరలఁ గన్నుఁదామరలువిచ్చి, విచ్చలవిడి యశ్రుజలధారాప్రవాహంబులు చెక్కుటద్దంబులపైనుండి చెఱఁగు మీఁదికి దిగజాఱి వక్షస్థలంబంతయు నిండుకొనఁ, వేఁడినిట్టూర్పులు విడుచుచుఁ

జెమ్మటలం గ్రిమ్ముకొని నెమ్మేను గడగడవడంకఁ గడంక దక్కి చిన్నమొగంబు విన్నఁదనంబున కిమ్ముఁజూపఁ బరితాపదవానలంబునఁ బడి పొక్కుచు, సుక్కుచు, లేచికూర్చుండి శోకరసం బాకారముఁ దాల్చినచందమునఁ, జిత్రిను గాత్రముఁ గైకొన్నరీతి, సాధ్వసము సాధ్వియైన తెఱఁగునఁ, గరుణము కరణంబులొందినకరణి వెక్కి వెక్కి యేడ్చుచు, నేడుపువిడిచి మౌనంబు పూనుచు, మౌనంబుమాని తనలోఁదా నగుచు, నగ వుడిగి తల యూఁచుచుఁ, దలయూఁచుట విడిచి ముక్కుపై వ్రేలు గీలుకొలుపుచు, జాలికొని హాహాకారంబుసలుపుచుఁ "దలఁపనితలఁపు లివిగో చూచితే, లక్ష్మణా" యని యతనిదిక్కు చూడ్కులు నిగిడించి యిట్లనియె. "అన్నా! భయపడకు. ప్రభువర్యునాజ్ఞ దాఁటరాదు గావున నీ విట్లుచేయుట తప్పేమి? కష్టములుపడుట కే నన్ను బ్రహ్మదేవుఁడు సృజించియుండఁగా నెవ్వ రాఁపఁగల రు? మొన్న మొన్నటివఱకు మేము చేసిన యరణ్యావాసముతోనే నాయిడుమ లన్నియు గడచిగట్టెక్కితి ననుకొంటిని గాని, యింతలోనే యింతయగునని యెఱుఁగకపోతినిగా! ఇదంతయు నా దుశ్శకునములఫల మేగాఁబోలు. ఇట్టిదుఃఖము నే ననుభవింపవలసి యుండుటచేతనే నేనట్టివిపరీతవుకోర్కెఁ గోరితి. నేను బూర్వ జన్మముల నేదంపతుల వియోగమునకుఁ గారణనై వారు దుఃఖించుచుండ నవ్వుచుండితినో ఆపాప మూరకపోవునా? నాఁడు కాఱడవుల రామపదజలజాప్తి వసించితి, నేఁడు నాథుపొందులేక యనాథనై యిచట నెట్లు ప్రాణములనిలిపికొనఁగలను? నేను పతివ్రతనని యందఱును బొగడుచుందురని సంతోషించి

తినిగాని, యిట్టి కటికినేలందలువుల్లు యడవిందో్రిచునని యెఱుఁగ
నైతినే! అయ్యయ్యో లక్ష్మణా! పిడుగుకంటె బెట్టిదమైనమాట
వినియు గుండెబ్రద్దలుగాక యెప్పటివలెనున్న దేమి? ఇంక నెట్టి
యాపద లొందవలసియున్నదో? కలఁతపడి యొకమాట చెప్పఁ
బోయి, వేఱొకమాట చెప్పితివా? లేక యన్నమాట పరాకునఁ
దప్పవింటివా? కలలోనైన రామచంద్రమూర్తి యడవులలో
నన్నుఁ ద్రోయఁబంపునె? మతిపోయి యట్లుపలికితివేమో?
కటకటా! కాదుకాదు. నీకట్టిభ్రాంతియుండునే? ఎఱుఁగ
కిట్లన్నందున నన్ను క్షమింపుము. ఎన్నఁటికైనను శ్రీరామచంద్ర
మూర్తిని నేనును నన్ను శ్రీరామచంద్రమూర్తియుఁ గన్నులఁజూ
చుట ప్రాప్తించునో, లేదో? అట్టిభాగ్యము పట్టకపోయినఁ బ్రాణ
మేలపోదు? "నాదేహమున్నది, చెంత గంగ మడుఁగున్నది.
ఐనటులగు" సని మీయన్నగారి చెవులారఁ దెల్పుము. "నన్నుఁబా
సియశోకవనములోఁ జాలదినములు బ్రతికియుండలేదె" యని
నాథుఁడు తలచెనుగాఁబోలు! కాని "మరల నాయనవచ్చి శత్రు
నిఁజంపి, నన్నేలు" నను నాశగదా నన్నప్పుడు బ్రతికించినది? ఇ
ప్పు డెట్టియాసచే జీవింపఁగలను? మూఢు లెగ్గాడినంతమాత్రము
ననె విభుఁడు నన్నుఁ గానలకుఁ బంపివేసెనుగాని యొకసారి న
న్నుఁబిలిచి, యథార్థముఁదెలిపి మనోవ్యథతీర్చి "నిన్నెప్పుడును
మఱవ"నని పంపఁడయ్యెఁగా! నాయందుండిన యభిమానమును
బ్రేమయు నేమైపోయెనో!

చ. అడలకు మన్ననీకు వసుధాధిపు నానతిదాఁటవచ్చునే
యిడుమలఁజెందుమంచువిధియీధరనన్ను సృజించియుండగా-

గడవఁగ నెవ్వరోపుదురు, కానల కేగిననాఁడె యాపదల్
గడచితినంచునుంటి నెఱుఁగం దుది నిట్లగునంచు నాఘనా.

క. ఆదుర్నిమిత్తములఫల
మీదుఃఖము సేయకున్నె, యీదుఃఖము లా
పాదింప విధితలంచియె
కాదే యాకోర్కె నాకుఁ గలిగించుటయున్.

చ. ఎడపక పూర్వజన్మముల నేమిథునంబులఁ బాయఁజేసి వా
రడలఁగ నవ్వుచుండితినొ యాయఘ మూరక పోదు నాఁడు కా
ఆడవుల రామపాదజలజాప్తి వసించితి నేఁడు నాథుపాం
దెడసి యనాథనై యిచట నేగతి మేనభరింతుఁ బ్రాణముల్.

ఆ. ఏను సాధ్వినంచు నెల్లవారలు నన్ను
సన్నుతింతురనుచు సంతసింతుఁ
గాని నడుమ నిట్టికటికసందఁ బుట్టి
యడవిఁ ద్రోచు రాముఁడనుచు నెఱుఁగ.

చ. కటకట లక్ష్మణా! పిడుగుకంటెను బెట్టిదమైనమాట నేఁ
డిటు వినియుండియుం బగుల దింతలునింతలుగాదు గుండె యె
ప్పటివలెనున్న దీకటికభావముతో నసువుల్ భరించి యి
ట్లటవిని యింక నేవలన నాపదలొందఁగ నున్నదాననో.

చ. కళవళమంది తెల్పితివొ కాక పరాకునఁ దప్పవింటివో
కలనయినన్ రఘూద్వహుఁడు కానలలో ననుఁద్రోయఁబం
చునే

తెలిసి గణింపు లక్ష్మణ! మతిభ్రమ మైనదొ హా! సహింపుమి
ప్పలుకు లెఱుంగకంటి వెతఁ బాటిలె నీకొక భ్రాంతియున్న దే.

ఉ. ఎన్నఁటికిన్ రఘూద్వహుని నేనును నన్నిఁక రామచంద్రుఁడుం
గన్నులఁ జూడఁగల్గదొకో కల్గక యుండినఁ బ్రాణమేలపో
దన్న రఘుప్రవీరు చెవులారఁగ నింతయుఁ దెల్పు నాదు మే
నున్నది చింత గంగమడుఁగున్నది మైనటులయ్యెడుం దుదిన్.

చ. పతిమతి నెంచనేమి తనుఁ బాసి యశోకవనంబులోపలన్
బ్రతుకదె పెక్కునాళ్లనుచుఁ గ్రమ్మఱఁ నాఁ జనుదెంచి శ
త్రుసిన్
హతునిగఁ జేయు నేలునను నాసగదా బ్రతికించె నాఁటికా
గతి నిఁక నేమి యాసగొని కాయము నిల్పుదుఁ దెల్పుమిన్ని
యున్.

చ. ఎఱుఁగని మూఢులాడుకొను నెగ్గులకున్ భయమందియప్పుడే
కఱకు మనంబుతో విభుఁడు కాననసీమకుఁ బంచెఁగాక య
త్తెఱఁగొకసారి నన్ బిలిచి తెల్పి మనోవ్యథ తీర్చి నిన్ను నే
మఱనని పంపఁడయ్యె నభిమానముఁ గూర్మియు నెందుఁ
బోయెనో.

లక్ష్మణా! ఎంత దౌర్భాగ్యురాలను! ఆకస్మికముగ జ
నించిన యపవాదము చేత నెంతముప్పు వాటిల్లె! శ్రీరామచంద్ర
మూర్తి దివ్యవదనారవిందమును జూచు భాగ్య మీ జన్మమున
నింకఁ బట్టదేమో!

క. ఆకరుణ, యాప్రసన్నత,
యాకూరిమి, యాప్రియోక్తి, యాగౌరవముం
గాకుత్స్థుఁడు మఱచెఁగదా
యాకస్మికముగ జనించు నపవాదమునన్.

శా. ఆకర్ణాయతనేత్రమై, మణిమయోద్యత్కుండలద్వంద్వశో
భాకీర్ణాంచితగల్లమై, సురదనంబై సుందరభ్రూయుతం
బై, కమ్రస్మితచంద్రికావిలసితంబై యొప్పు శ్రీరామమో
మీకాయంబునఁ జూచుభాగ్య మిఁక లేదేమో సుమిత్రాత్మజా!

అన్నా! దురాత్ములెవరో కొందఱు నిందసేసినంతమాత్రమున నది నమ్మఁదగునా? నే నయోనిజనై పుట్టి జనకమహారాజుచేఁ బెంపఁబడితినని యును, అనసూయ మొదలైనపతివ్రతాశిరోమణులు నానడవడి మెచ్చి బహుమానములుచేసిరనియును, లంకాపట్టణములో మున్ను నేముల్లోకంబులు గీర్తింప నగ్నిఁ జొచ్చుటయును, అప్పుడీమె నిర్దోషిగావునఁ బరిగ్రహింపుమని బ్రహ్మాదులు రామునితోఁ బలుకుటయును సర్వము నెఱిఁగియుండియు నెఱుఁగనియట్లు ప్రజలు దుర్భాషలాడిన నాథుఁడు వానిని బాటించి యిట్లు చేయఁదగునా? ఇంతయును నా దురదృష్ట మిట్లుండఁగా నొకరిన ననేల? పతిని బాసి యొంటిగ నడవులకేలవచ్చితివని మునిపత్నులడిగినచో వారి కేమిప్రత్యుత్తరమియ్యఁగలను? ఈయాపత్సముద్ర మెట్లీఁదఁగలను? క్షణమొక మహాయుగముగనుండఁ గాల మేరీతిఁ గడపఁగలను?

సీ. అవని నయోనిజనయిపుట్టి మిథిలేంద్రు
వీట నేఁ బెరిగినవిధము వినరొ
యంగరాగములిచ్చి యనసూయ మొదలైన
సతులెంతొ మెచ్చినది చాలవినరొ
యాలంకలోఁ దొల్లి త్రైలోక్యము నుతింప
వహ్నినేఁజొచ్చినవార్త వినరొ
యీసీత నిర్దోషి యేలుకొమ్మని రాము
బ్రహ్మాదులపుడన్న పలుకువినరొ

గీ. వినియుఁ గనియుఁ బ్రజలు నను నిందసేసిన
యంతమాత్రమునకె యధిపుఁ డులికి
యింత తెగువసేయ నిచ్చగించుట నాయ
భాగ్యమింతె యొకరిఁ బల్క నేల?

చ. వనములకేలవచ్చితివి వల్లభునింబెడఁబాసి యొంటిగా
ననిమునిపత్నులెల్ల గుమిగూడియడుగఁగ ధృతిమాలి వారికే
మనివివరింతు నింత విషదంబుధి నేకరిణెందరింతు నే
యనువున నీప్రతిజ్ఞ నమహాపురుషాగ్రణి యింతులక్ష్మణా!

అని యమ్మగువ మగని తెగువకుఁ బరితపించియు, నించుక తగవు దలంచి తెగువఁబూని మాఱుఁదితో—నోటమాట లేక దైన్యమాకారము దాల్చినట్లున్న మఱఁదితో మఱియు నిట్లనియె: "అన్నా లక్ష్మణా! దుఃఖమాఁపుకొనలేక నోటికివచ్చినట్లు మాటలాడితిని గాని, స్వామిచేసినది ధర్మసమ్మతమే.

సీ. అఖిలధర్మస్థితి నపచారియందునే
యాావనంబునఁ దపమాచరించెఁ
గరుణాసముద్రుఁడుగాఁడందునే యట్టి
యపరాధిఁ గృతకవాయసముఁగాచె
నాశ్రితరక్షమై నర్థిలేఁడందునే
పగతుతమ్ముని రాజ్యపదవినిల్పెఁ
బాటించి నన్ను సంభావింపఁడందునే
నాకుఁగా నెన్నియాన్నను లోచేసెఁ

తే. బతిజగించినకోలెను బరహితైక
లోలమతి యొడల్ సిదిమినఁ బొలువప్పు
నాతఁడిది కార్యమని నిశ్చయంబుచేత
నాయభాగ్యంబ యొండొకఁ వేయునేల?

ఎవరికిని లోకనిందఁ గడువశక్యముగాదు. నేనుమాత్రము వియోగదుఃఖముచే సాహసపుఁగార్య మొనరించి భర్తను బన నిందితుఁ జేయుదునే? పతియానతి నెఱవేర్చుటకంటె సతికొండు ధర్మమున్న దే?

తే. పతియ చుట్టంబుఁ బక్కంబుఁ బతియ చెలియు
బతియ తల్లియుఁ, దండ్రియుఁ బతియ గురుఁడు
పతియ దైవంబుగాఁబున నతనిపంపొ
నర్చుటయకాదె ధర్మంబు నాతికరయ.

చ. వగపునఁ దోఁచినట్లయు నవారణఁబల్కితిఁగాక భర్తకుఁ
జగదపవాదముం గడువశక్యమె? నేను వియోగమగ్నతం

దెగువకుఁజొచ్చి రాము జననిందితుఁ జేయుదునే! తదాజ్ఞ రెల్లగతులఁబూని కానల మెలంగెద మేనుగలంతకాలముఁ.

తప్పక స్వామియాజ్ఞ శిరసావహించి ప్రాణమున్నంతకాలము నరణ్యములలోనే మెలఁగెదను. నీవు శోక ముడుగుము. ధైర్యమూనుము. ఆలస్యమేల? అయోధ్యాపురంబునకుఁ బోయి ముువ్వురత్తలకును మ్రొక్కితిననియు, బంధుల నందఱ నడిగితిననియు, దయామయుఁడైన రామచంద్రమూర్తికి సాష్టాంగదండప్రణామంబు లాచరించితిననియుఁ దెల్పుము. నా మ్రొక్కుగా నీవు స్వామికి మ్రొక్కుము. ప్రజలను సర్వదా కరుణతోఁ గాపాడుచుండుమనియు, నమ్మోహనీయుని దివ్యమంగళవిగ్రహ మెన్నఁడు నాహృదయమును బాయదనియుఁ జెప్పుము. ఇఁక శీఘ్రముగఁ బొమ్ము. సర్వేశ్వరునికృపవలన సకలశుభము లొందుము. నన్నెన్నఁడును మఱవకుము.''

సీ. అన్న లక్ష్మణ, యింక నాలస్యమేటికిఁ
జను మయోధ్యాపురంబునకు నీవు
మువ్వురత్తలకును మ్రొక్కితినని తెల్పు
మచటిబంధుల నెల్ల నడిగితి నను
మతికృపాళునకు రామావనీంద్రునకు నా
మ్రొక్కుగా నతిభక్తి మ్రొక్కుమీవు
తనయాజ్ఞఁ దలఁదాల్చి జననింద తను జేఁద
నీక కానలఁ జరియింతు ననుము

తే. భూజనుల, బాంధవుల వెన్న పోవు మనుము
తలఁప నాకేదుగడయును దానె యనుము

భావ మెప్పుడుఁ దనమూర్తిఁ బాయ దనుము
నెమ్మి యొకయింత నామీఁద నిల్పు మనుము.

# పదునేనవ ప్రకరణము

"బ్రతికియుంటిని జీవచ్ఛవంబ నగుచు"

—పెద్దన

అట్టిస్థితిలో దిటముఁ దెచ్చుకొన నేసాధ్వీతరము? చెప్పఁ దలఁచినదంతయుఁ జెప్పి సీతామహాదేవి కన్నీరు కాల్వలుగట్ట నేడ్చుచుండెను. లక్ష్మణుఁడు కదలుటకుఁ గాళ్లురాకపోయినను బోవుట తప్పదుగాన, ధేనువును బాయఁజాలని దూడవోలె జాలిగొని "అమ్మా! యింక స్వామినిఁ గొలువనేగుదునె"యని వదినెకు మ్రొక్కి కాళ్లు వడఁకుచుండఁ బ్రదక్షిణ మాచరించి మేనెల్లఁ జలింప హాహారుమని యేడ్చుచు నెలుఁగెత్తి "మునిపత్నులారా! మాతల్లినివీడి యేగుచుంటిని. మీరు కరుణార్ద్రహృదయలై యీమెనుబ్రోవరే!" యనుచు నేగెను. ఏగి గుండె తల్లడపడ నావయెక్కి తిరిగితిరిగి సీతదిక్కుఁ జూచుచు "దిక్కుగలిగి నీకు దిక్కులేకపోయెనుగా తల్లీ!" యనుచు రథమెక్కి "సుమంత్రా! శ్రీరామపత్ని కెంతదుర్దశపట్టె" నని రోదనముచేయుచుఁ జనుచుండెను. అడవినున్న జానకియు మఱఁది మరలివచ్చునో యని యతఁడు వోయినత్రోవ పలుమఱుఁ జూచును. విధి దూఱుకొనును. "కటకట!" యనును. కొంతవడిదాఁక రథము

జూచు. మఱికొంతసేపు కేతనముఁజూచు. ఆమీఁద రథపరాగముఁజూచు. తరువాత నంతటనుగల వట్టిబయలుచూచు. చూచిచూచి, చొక్కి, సొక్కి, తాలిమిదక్కి, దిగులుపొంది, వగఁజెంది, బెగడొంది, యలసి, సొలసి, మూర్ఛలొలసి, తెలిసి మున్ను నాథుఁడు తన్ను ముచ్చటలడుగునప్పుడు చేసినచెయ్వులఁదలఁచికొనును. తలఁచికొని దుఃఖించును. "పతిపాయఁ జేసితివే దైవమా!" యను. 'ఇంకెవ్వరుది'క్కను. "ఈ ప్రాణములు పోవేల యారా!"యను. 'అమ్మా! భాగీరథీ! దయయుంచి నను జేకొమ్మా!'' యను.

ఆ కాంతామణి యాకాంతారమున నట్లు రోదనము చేయుచుండ మునిసుతులు విని వచ్చి చూచి, యాశ్చర్యవిషాదము లొంది మరలిపోయి "అయ్యా! ఒక స్త్రీరత్న మొంటిగ నుండి వలవలయేడ్చుచుండఁ జూచి, తెల్పవచ్చితిమి. ఆమెను రక్షించి పుణ్యముఁగట్టుకొనుఁడు" అని వాల్మీకమహార్షితో విన్నవించిరి. ఆయన దివ్యదృష్టిచే నంతయు గ్రహించి "ఆమె శ్రీరామచంద్రమూర్తి భార్య; జనకమహారాజుకూఁతురు" అని పల్కి వటులతో నేగి గంగాతటముచెంగటఁగన్నీరుమున్నీరుగా నేడ్చుచున్న సీతాదేవింగాంచి,దయార్ద్రహృదయుండై "అమ్మా! నీకు దుఃఖమేల? నీభర్త నీసుగుణోన్నతి నెఱిఁగియుఁ బ్రజల నిందఁ బడలేక, యిట్టిసాహసపుఁబనిచేసె. నన్ను నీతండ్రిగ తెలంచి, నాతో రమ్ము. ఈ యాశ్రమమంతయు నీదిగాదా? ఇచ్చటి తపస్వికాంత లందఱు నీకు సకలోపచారము లొనరింపఁగలరు. శోక ముడుగుము. నీవంటివివేకశాలినులు మాన్పరాని

దైవగతికి దుఃఖింపఁదగునా? నీతండ్రియో జనకభూపతి. మామయో దశరథమహారాజు. నీభర్తయో రామచంద్రమూర్తి. నీవో పతివ్రతాశిరోమణివి. అట్టి నీవు వెతఁగుంద నేల? నాథునాజ్ఞమబట్టి యిందు సుఖముగ నుండుము. రమ్మా.

చ. జనకుఁడు తండ్రి, సద్గుణవిశాలుఁడు పంక్తిరథుండు మామ, దు
ర్జనభుజగర్వవైభవవిరాముఁడు రాముఁడు భర్త నీకు, నీ
వనుపమధర్మమర్మనిధి వజ్ఞతఁజెందకు నాథునాజ్ఞఁ జే
కొని చరియింపు మేల వెతఁ గుందెద వర్ఘ్యముఁ గొమ్మ
మానినీ!"

అనుచు నర్ఘ్యమిప్పించి, యామెను దనయాశ్రమంబునకుఁ దోడ్కొనిపోయి, తాపససతులతో నిట్లనియె: "ఈ సాధ్వి రాజకులాభిరాముఁడగు రాముని దేవి. జనకరాజర్షికుమార్తె. దశరథరాజేంద్రుని పెద్దకోడలు. "రావణునిచేఁ జెఱవోయినకాంతఁ దెచ్చి రాముఁడు మరల నేలుచున్నాఁ"డని కొందఱు చెనుగులు దుర్భాషలాడ మదిఁగుంది రఘువరేణ్యుఁ డీమెను—నిష్కళంకచరితయని యెఱిఁగియు—వనములకంపెను. కావున మీ రీమెకుఁ బూజలుచేయుచు సౌఖ్యముఁగలిగింపుఁడు."

మహాప్రసాదమని తాపసకాంతలు సీతను గారవించి యుపచారముచేయుచుండ నామెకుఁ గొంతయూరటగల్గెను.

అహా! దైవవిధి!

సీ. రంగారుబంగారు చెంగావులుధరించు
శృంగారవతి నారచీరె లూనె

భోజనంబులుమెచ్చు భోజనంబులొనర్చు
కమలాక్షి కందమూలములు నమలెఁ
జంద్రకాంత విశాలచంద్రశాలల నుండు
జవ్వని మునిపర్ణశాలనుండె
మరులుతో శ్రీరాము నురముపైఁ బవళించు
బాలికామణి యొంటి పవ్వళించెఁ
గీ. గన్నుసన్నల శుద్ధాంతకాంత లాచ
రించుసేవలు మెచ్చని కాంచనాంగి
యుగ్ర మునిముగ్ధకాంతాకృతోపచార
విధికి; నెంచ నసాధ్యంబు విధికిఁగలదె.

# పదునాలవ ప్రకరణము

The mind is its own place and can make
A heaven of hell and a hell of heaven.
—Milton.

"జానకి కెట్టియిక్కట్టు సంభవించె! ఎక్కడఁ బ్రాణము విడునోగదా? నిన్న మొన్నటివఱకుఁ బడరానిపాట్లువడి కడకు సుఖించుకాలము వచ్చెఁగదాయని యెందఱు హర్షించుచుండఁగా సీతమ్మతల్లి కాఁపురము కడతేఱదాయెఁగా! అట్టివధూటిం బాసి రఘురామస్వామి యెట్లు దినముల వెళ్లబుచ్చఁగలఁడు? లోకనిందకు వెఱచిగదా పతి సీతనువిడిచె? ఆయమ్మ పరితాపమున నగుపాపము జనులదో, జననాథునిదో

గ్రహించితివా సారథీ! ఔను నీవన్నదే సత్యము; సుఖదుఃఖములు కాలానుసారముగఁ గలుగును. ధైర్యమువహించుటయే పరమధర్మము" అని లక్ష్మణుఁడు సీతావస్థనుగూర్చి తనహృదయములోఁ బొడమినభావములను మాటిమాటికి వెల్లడించుచుండెను. సుమంత్రుఁడు సమయానుకూలములైన యూఱడింపుమాటలాడుచు రథము నడిపించుచుండెను. మఱునాఁటి మధ్యాహ్నములోపల నయోధ్యఁ జేరిరి. లక్ష్మణుని దైన్యంబును, జానకీశూన్యమైన రథంబును గనుంగొని పురజనులు గుంపులుగుంపులుగాఁ గూడుకొని "నిన్న మనమువిన్నది నిజమై తోఁచుచున్నది. చూడుఁడు చూఁడుఁడు," అనిగుసగుసలాఁబోవువారును, "ఇంతలేసి సంసారవిచ్ఛేదంబులగుట మన యూరి పుణ్యాత్ములవలననేగదా! యింక నేనోరు పెట్టుకొని మాట్లాడుద" మనువారును, "ఇంతమాత్రమునకే రామభూకాంతుఁ డింతసాహసము చేయవచ్చునే" యనువారును, "ఇట్టిసాహసముచేయకున్న నిట్టిమహాపరాధ మేపగిదిఁ బాఁపుకొనవోపు" ననువారును, "ఎఱుకమాలి మొఱకుతనముతో నట్టి పరమపతివ్రతం బలికినవారు చల్లఁగా బ్రతికెద" రనువారును, "వీరి బ్రతుకు బంగారమయ్యె. ఇప్పుడు బంగారువంటి కాఁపురంబు విడిచి యాశృంగారవతి కాఱడవులంబడి బడలికతో నడలుచున్నదిగదా" యనువారును, "పూచిన తంగేడువలె, సింగారించిన రథంబువలెఁ, గన్నులపండువగు నింపుచూలాలి నడవులపాలుచేసి తాళవచ్చునే! మనజనపాలుఁ డేలాగు తాల్మిదాల్చి నిల్చెనో" యనువారును, "దిక్కులేనిదానివలెఁ గాన

లంబడి తల్లి యెంతసంతాపించెదవో" యనువారును, సీతాకాం తను దలఁచుకొని తలఁచుకొని దుఃఖించువారును, "దైవమా! యిటువంటిదుఃఖచాట్లు పగవారికైనం దగవుసుమీ" యని కన్నీరునించువారును నై పలుచందములఁ బలుక నాలకించుచు, సౌమిత్రి యెనుఁగుమొగసాలకడ రథంబుడిగ్గి, సుమంత్రు నిటకఁబంచెను. "మీరిట్టపు దేవిని నట్టడవుల విడిచిపెట్టి వచ్చితినని యీగొట్టుమాట దిట్టానముతో నింక నెట్టు విన్నవింతు? దైన్యరససదనంబగు శ్రీరామదేవవదనంబుఁ జూచి యెట్లు తాళుదు" నని తహతహపడుచుఁ గొన్నికక్ష్యాంతరంబులు గడచి, రాయంచలేని కొలఁకువలె, రత్నంబులేని పెట్టియవలెఁ, బద్మంబులేని కొలనువలెఁ, జంద్రకళలేని గగనంబువలె, సరస్వతిలేని ముఖంబువలె, రామభక్తిలేని చిత్తంబువలె, నుపకృతిలేని సంపదవలెఁ, గీర్తిలేని బ్రతుకువలె, వార్తలేని కవిత్వంబువలెఁ, గాంతిలేని యద్దంబువలె, శాంతిలేని తపంబువలె, శాఖలేని చెట్టువలె, రేఖలేని బొందివలె సకలవైభవంబులు గలిగియు జనకనందన లేనందునఁ జెన్నుదఱిగి విన్ననై యున్న యన్నగరుప్రవేశించి లక్ష్మణుఁడు శోకరసాకారుఁడైన రామచంద్రునిం గాంచి, యాయన పాదాంభోరుహంబున వ్రాలి, యశ్రుపూరము లెత్తై పారఁ దనమస్తకము రామాశ్రుధారలఁ దడియుచుండఁ నడలుచుండియు నెట్టకేల కెట్లో కొంతధైర్యమూని సీత నడవులఁ డించివచ్చిన సంగతియు, నప్పుడామె యన్నమాటలును విన్నవించెను.

సీ. "ఏకతంబునఁ దొల్లి యింతిపల్కిన కూర్మి
పల్కులు వాఖ్కిచ్చి పనవిపనవి
ప్రజలమిథ్యానిందఁ బాటించి వడినెంత
తెగువ సేసితినంచుఁ బొగిలిపొగిలి
యీమాట సౌమిత్రియెఱిఁగింప సతిచాల
యయ్యోనో వనినంచు నడలియడలి
ప్రాణేశ్వరినిఁ బాసి ప్రాణ బులింక మేన
నిలుచునోయని భీతిఁ గలఁగికలఁగి
గీ. యేసుఖమునింక నేలని యెంచియెంచి
నేత్రముల శోక బాష్పముల్ నించినించి
సొరిగి పలుమాఱుఁ బాన్పుపై నొఱఁగియొఱఁగి
యంతయు విభుఁజూచి లక్ష్మణుం డార్తుఁడయ్యె."

రాముఁడు తమ్ముఁడుపల్కిన దంతయు నాకర్ణించి "అయ్యో! ప్రాణేశ్వరీ! సీతా!" యని యొక్క పెట్టున నేడ్చెను. అప్పుడు లక్ష్మణుఁడు, "స్వామీ! శరీరకి సర్వదా సుఖముండునా? వచ్చు నాపదలు దుఃఖించినఁ బోవునా? నీ వెఱుఁగని దేమిగలదు? వగచుటమంచిదిగాదు. జగద్గురుఁడవైన నీకు నే నుపదేశముచేయు వాఁడనా? సర్వప్రపంచమును నీవైయుండఁగా సీత యెచ్చటి కేగినది? ఆమె నీలోనే యున్నది. నీ వామెలోనే యుంటివి. మిమ్ముఁ దెలిసికొనిన మహాపురుషులు సంసారమోహమువీడి విరక్తివహింపఁగ, మీరిట్లు భలుగిఁ జెందినవానివలెఁ జింతింపఁదగునే? మీరిట్లున్న సతివియోగ

ముచే రాముఁడు రాజ్యపాలనము చేయుమఁటచో” నని
ప్రజలనరా?

ఉ. ఆవెతలెన్నియైనఁగల వర్కకులాధిప దాఁటవచ్చునే
దైవగతుల్, శరీరికి సదా కలదే సుఖ మూర్తిఁజెందినం
బోవునె వచ్చునాపదలు? పుట్టి లయించుట కూడి పాయుటల్
జీవులకుఁ స్వభావములు చిన్మయమూర్తివి నీ వెఱుంగవే?

చ. వగచుట పాడిగాదు మిము వంటిమహాత్ముల కాత్మతత్త్వముఁ
దగిలి తలంచిచూచినఁ బృథగ్విధమెయ్యది సచ్చిదాత్మకం
బగు పరమాత్మవీవు, జగమంతయు నీవు దలంపనయ్యె నా
ది గురుఁడవైన నీకు నుపదేశము నే నొనరించు వాఁడనే.

చ. అవని జలాగ్నివాయు గగనాత్మకమైన ప్రపంచమంతయుఁ
బివిధచరాచరావళులు నీవయి నిండి వెలుఁగుచుండఁగా
నవనిజ యెందుఁబోయినది, యీయుభవద్వ్యతిరిక్తమైన వ
స్తు వొకటియున్నదే, మఱపుచూపునఁజూచి తలంక నేటికిఁ.

చ. అమలత మిమ్మెఱింగినమహాత్ములె పుత్రకళత్రమిత్రవ
ర్గముపయి మోహముంచక విరక్తివహింపఁగ మీరుఁజెల్లునే
భ్రమగొనివందుటఁ? దరుణిఁబాసి ధరాపరిపాలనంబు సే
యమఱచె రాముఁడంచుననరా ప్రజలాశ్రితరక్షణోత్సుకా.”

అనియన్నగారి నూరడించెను. రవివంశాబ్ధిచంద్రుఁడు
ధృతిఁబూని “తమ్ముఁడా! నీవుపల్కినదెల్ల నిక్కంబు. నీవచ
నామృతంబుఁ గ్రోలఁబ్రమోదభరితుండనైతి. దుష్టశిక్షణమొన

వించుచు, శిష్టరక్షణము సేయుచుఁ బ్రజలవిన్నపములువినుచు సకలజనసౌఖ్యకరంబుగ రాజ్యపరిపాలనముచేయు రాజే సత్కీర్తినొందునుగాని, రాజైనంతమాత్రమున నెవనివలన నెవనికిఁ బ్రయోజనము? భోగానుభవమదముచే నిజధర్మవిముఖుఁడైన భూపాలునకు నిహపరములు రెండును లేవు. ఏరాజైన "నేను మహానుభావుఁడను. ప్రజలకు దర్శనమిచ్చి వారివిన్నపము లాలకించినచో నాగౌరవము (Lignity) పోవును. ప్రజల కంటఁబడుట రాజలక్షణముగాదు. ఎవరిమాటవినకపోయిన నాకేమికొఱఁత? నేరాజగుటచేతనే సుకృతినైతి" నని భావించి సర్వకాలసర్వావస్థలయందు నంతఃపురములోనే యుండినచో వానికిని బ్రజలకునుగూడఁ గీడుమూఁడును.

మ. సుజనానీకముఁ బ్రోచుచుం గుజనులం శోధించి దండించుచుం
బ్రజలాయాయెడఁ దెల్పు విన్నపము లొప్పన్ వించు భూపాలనం
బు జనాధీశుఁడొనర్చి కీర్తివడయుం, భోగప్రమత్తాత్ముఁడై
న జనుల్ దిట్టుదు రిచ్చటన్ నిరయసంతప్తాంగుఁడౌ నచ్చటన్.

అనిపలికి నృగ నిమి యయాతిత్యాది పురాతనపుణ్యశ్లోక కథలు తనతమ్మునకు వినిపించుచు దినశేషంబును రాత్రియుఁగడపె. రామా! రాజన్ననిటెగదా!

# పదునేడవ ప్రకరణము

"చ. వినవు చెవుల్ కనుంగొనవు వీక్షణముల్ పెదవుల్ చలింప వే
మన నధికారమింత తమకబ్బిన మానవకోటి కీశ్వరా!
వినియెద వార్తనాదములు బీదలఁ గాంతువు నమ్మి వేఁడనో
యనియెద నీవ సేవ్యుఁడవయా తలపోయఁగ భక్తవత్సలా!"

రామచంద్రావనీంద్రుఁడు ప్రాతఃకాలమున లేచి సంధ్యాదికములుదీర్చి, సభాస్థలికిఁబోయి హేమసింహాసన మధిష్ఠించి యుదయగిరినిల్చుప్రభాకరునిభాతిఁ బ్రకాశించుచు, నిండుకొలువుండి మ్రోలనిలుచున్న లక్ష్మణుమోముఁజూచి "నీవుమొగసాలకేగి, యందెవ్వరైన నేదేని మనవిచేయువలయునన్న వారి నిటకుఁ దోడ్కొనిరమ్ము" అని యానతిచ్చెను. లక్ష్మణుఁడు "మహాప్రసాదము స్వామీ!" యనియప్పుడె వాకిటికేగుదెంచి, యందుఁ గిక్కిఱిసియున్న ప్రజకు రామాజ్ఞ నెఱిఁగించెను. ఆ జనులెల్లఁ జేతులుమోడ్చి "శ్రీరామచంద్రమూర్తి ముఖారవిందముఁ గన్నులారఁ జూడఁగోరుటతప్ప మేమిప్పుడు మనవిచేయుట కేమున్నది? రామరాజ్యము ప్రజల కెంతసౌఖ్యకరముగా నున్నదో మాటలలోఁ దెలుపశక్యమా? మేమేలోటులేక యా మహామహుని, ఆశాంతాకారుని, ఆదయామయుని, ఆధర్మస్వరూపుని ఆరాజపుంగవుని పేరు చెప్పుకొనుచు హాయిగా జీవించుచున్నాము.

సీ. కాననంబులయందె కాదుగా సుమనోవి
లాససంపద ప్రజలకునుగలదు

గంధసారమునం దెకాదుగా సంతతా
మోదంబు భూజనమునకుఁ గలదు
గగనాంతరమునం దెకాదుగా ఘనలక్ష్మి
తేజముగాఁ బౌరసంతతికిఁ గలదు
కనకాంబరమునం దెకాదుగా సుగుణసం
దోహాప్తి జానపదులకుఁ గలదు
గీ. కలితవిక్రమ ధానుష్క కరమునందె
కాదుగా ధర్మ మిల నెల్లఁ గలదు రామ
చంద్రుఁ జెప్పెడుఁ బరిపూర్ణ చంద్రులీల
రాజ్య మొనరింప నేమికో యంతమాకు."

అని యానందపూరితులై పలికిరి. అప్పు డక్కడ కొక కుక్క నెత్తురుకాఱు నెత్తితో వచ్చి మొఱ వెట్టుచుండెను. సౌమిత్రి కరుణార్ద్రహృదయుండై "యేల నీనడి నెత్తి పగిలినది? యిచట మొఱ సేయుట కేమి హేతువు?" అని యడిగెను. ఆశునకము "రాజుగారితోఁ గాని యితరులతోఁ జెప్ప"నని పలుక, లక్ష్మణుఁడు మంచిదని స్వామికడ కేగి మొదటఁ బ్రజమాటఁ జెప్పి, పిమ్మటఁ గుక్క సంగతి విన్నవించెను. "వెంటనే దానినిటకుఁ దీసికొనిర మ్మని ప్రభువర్యుని సెలవుకాఁగా శునకము భయముచే గడగడ వడఁకుచు "బ్రాహ్మణులు, ఋషులు మొదలగు మహానీయు లున్న సభాస్థలంబునకు నన్ను రమ్మనుట చతురత్వమే?" యని రామాజ్ఞఁ జెప్పిన లక్ష్మణునితో ననెను. అతఁడు మరలఁ బోయి స్వామితో నామాట విన్నవింపఁగా నంతట రామరాణ్మౌళియే యచ్చోటికరుదెంచి, నెత్తుటివఱదలో మునిఁగియున్న నెత్తినిఁ

జూచి యాతురతతో "ఏలవచ్చితి" వని శునకము నడిగెను.

"స్వామీ! కుక్కవేడ! యిచ్చటకు రానేల? వెడలఁ గొట్టుఁడు, కొట్టుఁ" డని సేవకుల నాజ్ఞాపింపక, మహాజనవిరాజితంబైన కొలువుకూటమువిడిచి నాయొద్దకువచ్చిన మీ దయాదిగుణోన్నతి నేమని కొనియాడఁగలను.

సీ. జలధిబంధనవేళ బలవత్కపులకన్న
మించఁగా నుడుత లాలించలేదె
శుకవామదేవాదులకు సమానముఁ జేసి
తొలమిఁ బక్షికి మోక్ష మియ్యలేదె
హనుమంతుచే క్షేమమరయుచో భరతుక
న్నను మున్నె గుహు వేడఁ బనుపలేదె
శబరియిచ్చినపండ్లచవి భరద్వాజుల
విం దొక్కరీతి భావింపలేదె

గీ. దొడ్డకొంచెంబు లున్నవే దొరవు నీక
టాక్షమున కెవ్వఁడైనచో నాశ్రయింపఁ
గదిసి రక్షించుటయె నీకుఁగలగుణంబు
రఘుకులక్షీరనిధిచంద్ర! రామచంద్ర!

దుర్జనులను శిక్షించి, సజ్జనులను రక్షించుటకై యిట్లవతరించిన దేవాదిదేవుఁడవు. నిన్నుఁజూచుటచేత ధన్యతఁజెందితిని. సాధురక్షణ మొనరించుటయే పరమధర్మముగా నెంచెదవుగావ, నా విన్నపమొక్కటి యాలకింపవె. నేనెవ్వరి కెగ్గు సేయక సంచరించుదానను గదా. అట్టి నన్నుఁగాంచి యేహేతు

వు చేతనోగాని యాగ్రహపరవశుఁడై యొకబిచ్చగాఁడు నా బుఱ్ఱ పగులఁగొట్టినాఁడు, చూడవే” అని శునకము మనవిచేసి కొనఁగాఁ గరుణాసముద్రుఁడగు రామభద్రుఁడు తత్క్షణమే భిక్షుకుని బిల్వఁబంచి “యీ కుక్కకు నీకు నేమిపగ? ఏల దీని తల వ్రయ్యఁగొట్టినావు? అయ్యో! బ్రాహ్మణుఁడవై పుట్టియు దురాగ్రహశత్రుఁ గెల్వలేకపోయితివే! ఇంకెక్కడి బ్రాహ్మణత్వము! ఎక్కడియాచకత్వము!” అని చీవాట్లుపెట్టెను. ఆభిక్షుకుఁడు చేతులుజోడించి “దేవా! నేనింటింటఁ దిరిగి, తిరిగి యలసి వచ్చుచుండఁగా నిది వీధిలో నడ్డముగా నిలుచుండి యెంతబెదరించినను గదలలేదుగానఁ గొట్టితిని. తప్పొనరించినందున నేను శిక్షకర్హుఁడనే. కావున నన్ను దండింపుఁడు” అని పశ్చాత్తాపముతోఁ బలికెను. అంతవానికిఁ దగినశిక్ష యేదియోయని ప్రభువర్యుఁ డాలోచించుచుండఁగా “కాలాంజనమను పర్వతమునందుఁగల దేవళమును బాలించుటకై వీని నియమింపుఁడు. ఇదియే తగినశిక్ష” యని సారమేయము సలహాయిచ్చెను. రామచంద్రమూర్తి నవ్వుచు ‘సరే, బాగుగనున్న’దనియాభిక్షుకున కప్పుడే తదాధిపత్య మొసంగి, ప్రభుత కభిషేక మొనరించి భద్రగజముమీఁద నెక్కించి పంపెను.

మంత్రులప్పుడు వెఱఁగందు “తప్పుచేసి విప్రుఁడు దుర్గాధిపత్యముఁ బడసెనంచు నింక నీయూరిలోఁగల భూసురులందఱు నిట్టే తప్పులు చేయుదు” రని పల్కిరి. స్వామి చిఱునగవుతో “ఆపని మంచిదో కాదో యీకుక్కయే తెల్పును. వినుఁడు” అని వచించెను.

"దేవా! అంతకంటె నవమానముగలదా? పూర్వము నేను బ్రాహ్మణుడనై పుట్టి దేవాలయాధిపత్యమొంది తదన్నభుక్తిగొనుటచేతనే, నేనిట్టిజన్మ మెత్తవలసివచ్చినది. కొంచెము దేవతాద్రవ్య మపహరించినను కుక్కతనము సంభవింపక పోవునా?

క. జనవర దేవబ్రాహ్మణ
ధనహరణ మహాఘదావ దహనము వంశం
బను వంశాటవిఁ గాల్పక
చనునే యెవ్వరికి దానిఁ జనునె యొనర్పన్.

ఉ. కోవెలపారుపత్తెమునకుం బనిఁబూనియు నేను సాధుసం
సేవయు దీనపోషణముఁ జేసితిఁగావున నీభవంబునన్
భూవరజాతిసంస్మరణముల్ వహియించితిఁ గ్రూరుఁ డిద్ధరా
దేవుఁడు సత్క్రియాప్తిఁ గడతేఱఁగలాఁడె తలంచిచూచినన్.

అని పూర్వజన్మస్మృతిగల యాకుర్కురము పలికి, రాఘవుఁబొగడి, సెలవుదీసికొని కాశికేగి యచటఁగొన్నాళ్లకు మేను విడిచి సద్గతిఁజెందెను.

# పదునెనిమిదవ ప్రకరణము

"శ్లో. పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే."
—భగవద్గీత.

శ్రీరామచంద్రదర్శనార్థమై యమునాతటారణ్యవాసులైన చ్యవన మరీచి కశ్యపభరద్వాజ పులస్త్యాదిమునీంద్రులు వచ్చిరి. స్వామి యెదురుగఁబోయి, నమస్కరించి, తోడితెచ్చి, యుచితపీఠములిడి, వారు తెచ్చిన పావనోదకంబులను, పక్వఫలోత్కరములను స్వీకరించి "తాపసవరేణ్యులారా! మిమ్మొకసారి దర్శించినంతమాత్రముచేతనె మావంటివారు ధన్యులగుదురు. ఈఫలాదులేఁ? ఐనను మీరు వానిని దయచేసినప్పుడు వద్దనరాదు. నాసర్వస్వము మీయాధీనము గావున నన్నుఁగటాక్షించి నే నిప్పుడాచరింపవలసిన పనులేవోసెలవిండు" అని వినయవినమితోత్తమాంగుఁడై పలికెను.

శా. ఆధుల్ దీర్పఁగనొప్పు మీచరణతోయంబుల్ శిరంబానినా
నాధన్యంబుపు లింకనేల మిముసందర్శింపనో సత్ఫలం
బే ధన్యాత్ముని జేసెఁ గావలయునే యీపండులన్లైనచో
సాధూత్తంసములార మీరు కరుణించక గాదనన్ వచ్చునే.

శా. నానామంతచయంబు,నాయనుజసంతానంబు,నాదేహముల్,
నాసర్వస్వముమీయధీనము, కృపన్ నన్నుం గటాక్షించి నే

దానే సత్త్వముతో నొనర్పదగు కృత్యంబుఁ బ్రబోధింపుఁడం
చానర్వాంక మబుద్ధి పల్కి మునులత్యానందమగ్నాత్ములై"

"ప్రభువరేణ్యా! యేరాజులైన నీరీతి వినయసంపన్నులై మనోహరంబుగ సంభాషింపఁగలరా? మనస్సులో నున్నదాని నున్నట్లు వెల్లడింతువుగాని, కపటమున్నది యెఱుఁగవు. నీవంశ మెంతప్రశస్తమైనది. బ్రాహ్మణభక్తియు, దుష్టశిక్షయుఁ బూని, నీవిచటఁ బుట్టితివి గావున మాకొక్క యుపకారముఁ జేయఁ బ్రార్థించుచున్నాము. మధుఁడను దైత్యుఁడొకఁడు తపంబుచే శివుని మెప్పించి యొకదివ్యశూలముఁ బడసె. ఆశూలమును ధరించిన వానిని యుద్ధములో గెలువ నెవరితరముగాదు. వాఁడొకవేళ శూలమును మఱచెనా, వైరిచే హతుఁడగును. మధుకుమారుఁడైన లవణుఁడను దురాత్ముఁడు తండ్రిశూలముఁగొని మదోన్మత్తుఁడై దేవతలను, మావంటిఋషులను, మనుష్యులను బాధించుచున్నాఁడు. మమ్ము రక్షించుటకై మీరున్నారుగదాయని మేము ధైర్యమువహించి యీసంగతి మనవిచేయవచ్చితిమి. రావణాసురుని సంహరించిన మీకీలవణాసురుఁడనఁగ నెంత? కరుణించి మమ్ముఁ బ్రోవవే" అని చ్యవనఋషి వేఁడెను. రాఘవస్వామి యభయహస్తమొసఁగి వారలను దగుతమ యాశ్రమంబులకుఁ బంచి "లవణాసురునిఁ జంప నన్నుఁ బంపు" మని కోరినశత్రుఘ్నుని యుత్సాహముమెచ్చి యొకయస్త్రరాజమిచ్చి, లవణవధోపాయ మెఱిఁగించి, సైన్యాధిపత్యధర్మములు బోధించి, యాతని నొకశుభదినమున మధుపురంబునకుఁ బోవ నియమించెను.

“క. సేనాధీశుల, భటులం బ్ర
ధానుల, బాంధవుల, హితులం, దగురీతుల స
న్మానింపు మేమఱక, తఱికై
యైనపనుల్ గొనుము సముచితాదరణముగాలన్.

క. వడిగలవారని భటులను
బడలింపకు మనఘ! నిడుదపయనంబుల మాఁ
డడు వేసవిని రా విడిసిన
యెడలం బ్రజ డప్పినొప్పి తెలుఁగుము కరుణన్.

మ. ధనలోభంబునఁ బ్రోవకుండెనుసుమీ తండ్రీ! భటశ్రేణులన్
ధనముల్ రాజ్యము, దుర్గముల్ భటులచేతంగా దెసంరక్షఁ జెం
దు నృపాలుండు భటేతరుండయినశత్రుల్ చీఱికింగొందు రే
జనులున్ మెత్తురె హత్తునే విజయముల్ సంగ్రామరంగంబునన్.

క. ఎప్పుడు లవణునిఁ గూల్చితి
వప్పుడె నీవిజయరేఖ లనువు మిచటి కీ
వప్పనికిఁ దామసించినఁ
జెప్పెడిదే మంగళముల జీవములున్నే?”

శత్రుఘ్నుఁడు వసిష్ఠునకు మ్రొక్కి, యాయనయాశీర్వాదమునొంది, తల్లులకందఱకు నతిచేసి, వారిదీవనలు గ్రహించి, స్వామి కభివందనము లాచరించి, యిద్దఱగ్రజులకుఁ బ్రణమిల్లి, బ్రాహ్మణపూజచేసి సేనాసమేతుఁడై, పయనమై మూడుదినములలో వాల్మీకాశ్రమముఁ జేరెను. అతఁడచ్చట మునీశ్వరుఁడిచ్చిన పావనార్ఘ్యమ్ముఁగొని, మూలఫలాది వన్యభక్ష్య

మ్ములఁ దుష్టినొంది, సరసప్రియభాషలఁ బ్రొద్దుపుచ్చి, నాఁటి రాత్రి యాఁగెను.

---

# పందొమ్మిదవ ప్రకరణము

"Go forth, beloved of heaven:
Go, and return in glory"
—Macaulay.

నాఁటిరాత్రియే సీతాదేవికి వంశదీపకులగు నిర్వురు పుత్రులు జనించిరి. అప్పుడు పూలవానగురిసె. దేవదుందుభులు మ్రోసె. చల్లనిగాలి సల్లడల వీచె. అచ్చటిఋషులందఱు సంతోషించిరి. ఆ శుభవార్తవిని వాల్మీకిమహాముని సత్వరుండయి చని బాలురఁజూచి పరమానందమొంది, తత్కుశలార్థమై కుశసంఘంబు లవంబుసించి, వారలకుఁ గుశలవు లను నామంబు లిడెను. ధాత్రీపుత్రి క్షేమంబును, పుత్రోదయసమాచారము ను దెలిసికొని శత్రుఘ్నుఁ డింతింతయనరాని సంతసముఁజెంది, రేపకడలేచి, మునిపుంగవు వీడ్కొని, జయార్థియై మధుపురంబు నకుఁ బోయెను. అచ్చట లవణశత్రుఘ్నులకు ఘోరమైన ద్వంద్వ యుద్ధము జరిగెను. శత్రుఘ్నుఁడు లవణాసురుని సంహరించి, వాని పురంబున కధీశ్వరుఁడై, పండ్రెండేండ్లు ధర్మనిరతి రాజ్యముచేసి, యన్నగారిని జూచుటకై మరలివచ్చుచు వాల్మీకాశ్రమమున బసచేసెను. ఈ శిశువులు వీణెలూని వాల్మీకిమౌనిరచిత రామా

యణశ్లోకములను గానలీలఁ బఠియించుచుండిరి. వారిపాట యమృతోపమానమై వినువారి నానందరసాబ్ధి నోలలాడించు చుండెను.

సీ. ఉరు సుధారసధార లొలికెడుచందాన
సరసస్వరస్ఫూర్తి సంఘటిల్లఁ
దిన్నగాఁ దావిపూదేనె సోనలుమించు
విధమునఁ దానముల్ విస్తరిల్లఁ
గండచక్కెరపానకమ్ములుప్రవహించు
రహిఁ ఘనరాగముల్ రక్తిగుల్క
విరివియై చెఱకుపాల్ వెల్లువవాఱెడి
క్రమమున నాలాపగతులు వెలయఁ
గీ. గవలు కవివిరోలూని ద్రాక్షాఫలోప
మానమానితవాల్మీకి మౌనిరచిత
చారు రామాయణశ్లోకసమితి గాన
లీలఁ బఠియింప శత్రుఘ్నుఁడాలకించి."

శత్రుఘ్నుఁడు సంతోషపారవశ్యముచే నారాత్రి నర్థక్షణమాత్రముగాఁ గడపి, తెల్లవారినతోడనే ప్రయాణమయి సూర్యాస్తమయమగుసరికి నయోధ్యాపురముఁ జేరి, శ్రీరామమూర్తికి భక్తిపూర్వకముగ నమస్కరించి, యావద్వృత్తాంతము విన్నవించెను. స్వామి యాతనిఁ గౌఁగిలించుకొని "తమ్ముఁడా! నీధైర్యపరాక్రమముల కెంతయు సంతసమగుచున్నది. కాని నీవు స్వాధీనముచేసికొనిన శత్రుపురము వీడి యిచ్చటనే

యున్నచో, నచ్చటిరాజ్య మరాజకమై ప్రజలకు దుఃఖకరమగును. కావున నేఁడురోజులుమాత్ర మిందుండి మరల నీవు రంబున కేగుము. నిన్నుఁబాసి మేమైన నిలువలేముగాన, వలసినయపుడు వచ్చి తల్లులను, మమ్మును, మిత్రులను జూడవచ్చు" నని పలికెను. శత్రుఘ్నుఁడు రామాజ్ఞప్రకారము వారము రోజులుండి పిమ్మట నిజనగరంబున కేగి సకలజనరంజకముగ రాజ్యమేలుచుండెను.

## ఇరువదవప్రకరణము

"ఉ. భూమిజఁగాని యన్యసతిఁబొందఁడు కామితమిచ్చుఁగాని తా
నేమియుఁదెమ్మనండు సురలెన్నఁడి సత్యముకాని పల్కఁడు
ద్దామగరిష్ఠుఁడై యభయదానమెగాని తలంకఁడెందు మా
రామునివంటిభూపతి ధరంగలఁడే తలపోసిచూడఁగన్."

సీతావియోగజనితదుఃఖ మెట్లో యడఁచికొని, శ్రీరామచంద్రమూర్తి నిరుపమవిధంబుగ నయోధ్యాపురపాలన మొనరించుచుఁ గొంతకాలమైనతరువాత నశ్వమేధయాగము చేయ నిశ్చయించి వసిష్ఠాదిమునీంద్రుల యనుజ్ఞఁగొని తగు నేర్పాటులు చేయఁబూనెను. నానాదేశనివాసులైన బ్రాహ్మణులు విచ్చేసిరి. సకలమహర్షులును, దేవర్షులును, బ్రహ్మర్షులును బిలిపింపఁబడిరి. కవిపండిత గాయక పరిహాసకాదులు రప్పింపఁబడిరి. విభీషణ సుగ్రీవాంగదాదు లాహ్వానింపఁబడిరి. జనక

భూపాలాది బంధుకోటికిని, సామంతరాజులకును, సర్వమిత్ర వర్గంబునకును శుభలేఖ లంపఁబడినవి. అందఱును వచ్చిరి. ఎవరి కేర్పడినచోట్ల వార లధివసించియుండిరి. నైమిశారణ్యపుణ్య క్షేత్రమున, గోమతీతీరభూమియందు మఖమండపము శాస్త్రోక్త ప్రకారము చతురశిల్పాచార్యజనులచేత నిర్మింపఁబడినది. మఖ శాల కన్ని యెడల బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర ప్రము ఖులు నిల్వఁదగు రచ్చకొట్టములు, బొక్కసపుటిండ్లు, పాకశా లలు, మఠములు, చలివెందరులు, దుకాణములు మొదలగు నవి కట్టింపఁబడినవి. వివిధధాన్యములు పర్వతాకారములుగాఁ బోయింపఁబడినవి. కాయగూరలు లెక్కకు మిక్కుటముగా కావి ళ్లలో నింపఁబడినవి. దధి ఘృత తైలాదులున్న బిందెలు వేనవే లున్నవి. ఇవియవియన నేల, కావలసినవస్తువు లన్నియు సిద్ధప ఱుపఁబడి కన్నులపండువుగ నుండెను. లక్ష్మణుండు రక్షకుండై యుండ గుఱ్ఱమువిడువఁబడెను. భయముచే నేరాజులు దానినిఁ బట్టఁ జేరరైరి. శ్రీరామచంద్రుఁడు పత్నీకృత్యములకు సీతాప్ర తిమ బంగారముతోఁ జేయించుకొని క్రతువాచరింపఁ దొడఁగెను.

సీ. బ్రాహ్మణక్షత్రియప్రముఖులఁ బూజించు
        పట్ల నేమఱకుండు భరతయనుచుఁ
గెలఁకులనుండి కావలయు యాగాప్తవ
        స్తువులందియుమ్ము శత్రుఘ్న యనుచు
నడుగువారలకు లేదనక యిష్టపదార్థ
        రాసులిమ్మా కపిరాజయనుచుఁ

క్రతువిఘ్నకరులశిక్షయొనర్చి క్రతుపుర
స్కృతిమొసర్పుము విభీషణ యటంచుఁ
తే. గోదవపడినవి వేవేగ గొంచువచ్చి
నియతి నెఱవేర్చుభారంబు నీదిసుమ్మ
వాయునందనయనుచు, భూవరుఁడు వారి
వారినియమించె నుచితప్రవర్తనముల."

అయన్నవస్త్రహిరణ్యాదిదానంబులకు మేరలేదు. బ్రాహ్మణులందఱుఁ దృప్తులైరి. బ్రహ్మఋషులందఱుఁ బ్రసన్నతఁజెందిరి. అర్థులందఱుఁ గృతార్థులైరి. బంధుమిత్రాదులందఱు హర్షించిరి. వారు వీరననేల, యప్పు డచ్చటనున్నవారందఱుఁ బ్రమోదభరితాత్ములై రామమహాత్త్వముఁ బలువిధంబులఁ బ్రస్తుతింప జన్నము మహావైభవంబున జరుగుచుండెను.

"చ. వలసినభోజనాభరణ వస్త్రధనాదులఁజెంది తృప్తులై
పలుమఱుఁజాలుఁ జాలునని పల్కెడువారలెకాని మాకుఁ గా
వలయు నొసంగుమంచనెడువారల మందునకైనఁ గాన మా
స్థలమున జానకీవిభుని జన్నము వైభవమెంచశక్యమే.

సీ. ఖర్వమహాఖర్వ కైలాసములు కుప్ప
వేసినచో నింత వెండియగునె
శతకోటి కాంచనాచలములు బంగారు
కూడఁబెట్టిననింత పైఁడియగునె
యర్బుదాయుత రోహిణాద్రిమణుల్ పోగు
నర్చిన నిన్నిరత్నంబు లగునె

యమితకల్ప మహీరుహము లొక్కదిక్కున
నిలిచియిచ్చిన నిన్ని వలువలగునె

గీ. నూఱులక్షలు కామధేనువులుగూడి
యన్నియును బోటికొసఁగిన నిన్నిసముచి
తాంచితపదార్థ నిచయంబులగునె! పవన
మిట్టులొనరించిరే తొల్లి యెవ్వరైన!"

నేత్రోత్సవంబైన తత్ప్రభువైభవంబుఁ జూడ వాల్మీకి దయచేసి రాఘవేశ్వరుసభలోఁ గుశలవులచే రామాయణముఁ బాడించెను. సభ్యులెల్లరు నానందపరవశులై కదలక మెదలక చిత్రరూపములకైవడి నుండిరి.

"గీ॥ చరితయన్ననో శ్రీరామచంద్రుచరిత
కవితయన్ననో వాల్మీకికవి సుకవిత
గాయకరవంబు కిన్నరకలరవంబు
ఇంక వినఁగ మనోహరం బేలకాదు?"

అని కాళిదాసమహాకవి చెప్పినది యథార్థముగదా!

రామచంద్రమూర్తి ప్రీతుఁడై యక్కుమారులు తన కుమారులేయని యెఱుంగక వారికి దివ్యవస్త్రాభరణాదు లొసఁగఁబోయె. కాని వారలు వానిని స్వీకరింపక, కరములుమోడ్చి "రాజచంద్రమా! కందమూలాదులు భక్షించుచు నడవులలోఁ దాపసవృత్తినుండు మాకిట్టి బహుమానములేల?" యని పల్కిరి. నృపశిఖామణి కడుసంభ్రమాశ్చర్యానురాగ నిమ

గ్నుఁడై "మీ రెవ్వరి కుమారులు? ఈ ప్రబంధ మెవరిచే రచింపఁ బడినది? ఇంక నెవ్వరు దీనిని నేర్చినారు" అని ప్రశ్నించెను. "ఇనవంశ శేఖరా! మీ పావనచరిత్రమైన యీ మహాకావ్యము వాల్మీకిమహాముని ప్రణీతమైనది. మేము వీరిశిష్యులము. నిత్యము నీసుధామధురచరిత్రఁ బఠియించుచుందుము" అని కుశ లవులువిన్నవించిరి. స్వామి ప్రతిదినము వారి గానామృతరసముఁ గ్రోలుచు సంతోషమున నుప్పొంగి వారి మనోహరాకారములఁ గన్నులారఁ గాంచి గాంచి, యొకనాఁ డిట్లు తలఁచెను. "వీరినిఁ జూచినకొలఁది నాకు వీరలయం దనురాగము హెచ్చుచున్నది. వీరిరూపులు జానకీరమణీకై వడి నున్నవి. శత్రుఘ్నుఁడు లవణా సురుని జంపివచ్చినతోడనే నాతో "వదినె కిద్దరుకుమారులు పుట్టిరి. తల్లియుఁ బిడ్డలును క్షేమముగా నున్నారని చెప్పినాఁడు గదా! ఆతనియులే వీరని తోఁచుచున్నది. లేకున్న నిట్టి యంద ముండునా? అయ్యో! సీత యడవులలో నెంతగాఁ గుందుచున్న దో? ఇంక నామెను జూడక తాళఁగలనా?"

అప్పు డిదియు సమయమని వాల్మీకి రామునకు జనకతనయ వృత్తాంతమంతయు సవిస్తరముగ నెఱిఁగించెను. రామవిభుఁడు కంటఁదడిపెట్టుకొని, యిట్టిసాధ్వి కెంత వంతఁగలిగించితినను చు మున్యాశ్రమంబుననున్న సీతాదేవిం బిలిపించెను. వాల్మీకి యామెంగాంచి "తల్లీ! నీవల్లభుఁడగు రఘువంశవల్లభుండు నీయు త్తమశీలము తెల్లంబుగాఁ దెలిసియుఁ బ్రల్లదంబులువల్కిన క్షుద్ర జనంబుల సందేహనివారణార్థమై, సభామధ్యంబున నీచేత శపథముఁ జేయింపఁదలఁచె" నని నుడివెను. ప్రాణనాథునియానతి నెఱవేర్చుటకంటె నాకు సంతోషకరమైనది లేదని, జానకి

మాతయగు భూమిదెసఁజూచి "అమ్మా! నేను నిత్యము శ్రీరామచంద్రమూర్తి పదాంబుజము లెద నారాధింతునేని, సదా రామాజ్ఞఁ జరింతునేని, జాగ్రత్స్వప్నసుషుప్త్యాదులందును రాఘుం దప్పనిదాననౌట సత్యమేని, నన్ను నీలోని కిప్పుడు గొంపోవమ్మ" యని యచ్చటఁ గ్రిక్కిరిసియున్న జనులెల్లరు విస్మయమంద శపథమొనరించెను. అప్పుడు భూదేవి సాక్షాత్కరించి పరమపతివ్రతాశిరోమణియైన కూఁతును రసాతలంబునకుఁ గొంపోయెను. బ్రహ్మాదిదేవతలు మందారకుసుమవర్షము గురిసి, జగతీనందన పాతివ్రత్యప్రభావము నభినందించిరి. కాని జానకీవియోగంబునకై, శ్రీరామమూర్తి యవిచ్ఛిన్నాశ్రుజలధారాపూరితనేత్రుఁడై వెక్కి వెక్కి యేడ్చుచుండ, వసిష్ఠవాల్మీకాది మునీశ్వరులు సమయోచితవాక్యంబుల దుఃఖోపశమనము గావించుచుఁ, బుత్రయుగయోగానంద మగ్గించుచు నా భూరమణునుమదికిఁ గొంత సంతసముఁ గలిగించిరి.

శ్రీరామచంద్రమూర్తి ప్రియసుతయుగ్మముం దిగిచి, పెద్దయుం బ్రొద్దాగిఁ గౌఁగిలించి, మోదయుతమనస్కుఁడై, యాగంబునకు వచ్చినవారినందఱను స్వస్థానంబులకు వీడ్కొలిపి, సర్వజనంబులు హర్షింపఁ దాను నిజనగరంబుఁ జొచ్చి, పూజ్యరాజ్యమహిమాన్వితుఁడై "సీతవంటి సతి పోయినపిమ్మట నింకొక్కతెను బెండ్లియాడ" నని సీతఁబోలిన పైఁడిబొమ్మను దనచెంత నెల్లవేళల నుంచుకొని, యెవరికి నెన్నఁడు నేకొఱఁత లేకుండునట్లు ప్రజాపాలన మొనరించి ఆచంద్రతారార్కమగు సత్కీర్తి నొందెను.

పరమేశ్వరా! మాభరతమాతకు శ్రీరామచంద్రమూర్తి

త్రివంటి యనేకపుత్రరత్నంబులను, సీతామహాదేవివంటి పుత్రీ కామణులను బ్రసాదింపుము తండ్రీ!

హైందవసోదరులారా! మీరు నిరంతరము శ్రీరామచంద్ర పవిత్రచరితామృతముఁ గ్రోలుచు నాయనసౌజన్యములో శతాంశమేని మీప్రవర్తనములోఁ జూపరే.

భరతభూనాయకులారా! మీరు రామరాజ్యము నాదర్శముగా గ్రహియించి, మీమీరాజ్యములఁ బరిపాలింపరే.

సర్వేజనాః సుఖినోభవన్తు!
ఓం శాంతిః శాంతిః శాంతిః.

"సీ. ధరనెన్ని పుణ్యతీర్థములైనఁ గలుగనీ
రామనామము సరిరావు దలఁప
నిర్మలస్థితినిచ్చు నిధులెల్లఁ గలుగనీ
రామనామము సరిరావు దలఁప
నానావిధములైన దానములుగలుగనీ
రామనామము సరిరావు దలఁప
నతిశయంబుగ మహావ్రతములు గలుగనీ
రామనామము సరిరావు దలఁప
తే. రామనామంబె సారంబు; రామభద్ర
రామచంద్ర! రఘూద్వహా! రామ! యనుచు
ననయము జపింపవలయు; దక్కనవియేల?
రామనామంబునకు సరిరావు దలఁప."

సంపూర్ణము